


సత్యమేవ జయతే

# సాక్షి



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 12

సంచిక: 192

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనాలు, 7,8,9, 10,11,12 పేజీల్లో..


ఐదున్నర అడుగుల ఆ రూపం ఈ దేశానికి
చెక్కుచెదరని ప్రతిరూపం అయ్యింది.
ఆ పెదాల మీది బోసినవ్వు
బ్రిటిష్ సామ్రాజ్యాన్నే హడలెత్తించగలిగింది.
ఆయన వేసిన ప్రతి అడుగూ చెదిరి ఉన్న
మతాలను, జాతులను, భాషలను,
సంస్కృతులను ఒక్కచోటుకు చేర్చగలిగింది.
సమస్త భారతీయుల దీక్షను చేతికర్రగా ధరించి
ఆయన ఈ దేశాన్ని భారతదేశం చేశాడు.
దేశీయతను భారతీయతగా మలిచాడు.
ప్రజలను జాతిగా సంఘటితం చేశాడు.
మొలన ఉన్న గడియారంలోని పెద్దముల్లు
లక్ష్యంగా, చిన్నముల్లు కర్తవ్యంగా
ఆయన చేసినది మహా పరిశ్రమ.
ఆయన కప్పుకున్న ధవళ వస్త్రం స్వచ్ఛతకు చిహ్నం.
ఆయన అహింసను గెలిచే ఆయుధం లేదు.
ఆయన సత్యాగ్రహాన్ని ఓడించేదే లేదు.
తన సులోచనాలతో అనునిత్యం
దర్శించినది ఒకే ఒక స్వప్నం.
స్వేచ్ఛాభారతం.. సహన భారతం..
జ్ఞాన భారతం.. ఆధ్యాత్మిక భారతం..
**గాంధీజీ జన్మించి 150 సంవత్సరాలు.**
ఇన్నేళ్ల తర్వాత ఆయన కలలుగన్న
భారతాన్ని సాకారం చేయవలసి ఉంది.

# భారతత భాగ్య విధాతా!




గాంధీజీకి తొలి సంతానంగా ఒక పాప పుట్టి మూడు నాలుగు రోజులకే చనిపోయింది. తాను చేసిన తప్పునకు దేవుడు విధించిన శిక్షగా భావించి దాన్ని అంగీకరించారు.



“ నోబెల్ శాంతి బహుమతి గెలుచుకున్న ఐదుగురు నేతలు– మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ (అమెరికా), నెల్సన్ మండేలా (దక్షిణాఫ్రికా), అడాల్ఫో పెరెజ్ ఎస్క్వివెల్ (అర్జెంటీనా), దలైలామా (టిబెట్), ఆంగ్ సాన్ సూకీ (మయన్మార్)– తమ మీద గాంధీజీ ప్రభావం ఉందని చెప్పుకున్నారు.

“ రచయితలు, చింతనాపరులు జాన్ రస్కిన్ (బ్రిటన్), లియో టాల్‌స్టాయ్ (రష్యా), ఎడ్వర్డ్ కార్పెంటర్ (బ్రిటన్) రచనల వల్ల అమితంగా ప్రభావితం అయ్యారు గాంధీజీ. వాళ్లను తన గురుతుల్యులుగా పేర్కొన్నాడు.



నిన్నటి..

# ఆ అడుగుజాడలు..

**మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీగా దక్షిణాఫ్రికా వెళ్లిన గాంధీజీ... ఉద్యమకారుడిగా తిరిగి వచ్చిన నాటి నుంచి వేసిన అడుగులు చరిత్ర గతినే మార్చేశాయి. ‘రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి. చివరికి వారు నిష్క్రమించక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. చంపారణ్‌లో రైతుల కోసం మొదలుపెట్టిన తొలి ఉద్యమం అనంతరకాలంలో ఎన్నో కీలక ఘట్టాలకు స్ఫూర్తినిచ్చింది. దేశానికి మహాత్ముణ్ణి అందించింది. బ్రిటిష్ పాలకులకు ఊపిరాడనీయకుండా చేసిన ఉద్యమాల పరంపర 1948 జనవరి 30న ఉన్మాది తూటాలకు గాంధీజీ నేలకొరిగే వరకూ సాగుతూనే ఉంది. ఆయన ప్రస్థానంలోని ముఖ్యమైన అడుగుల జాడలివి...**


జనవరి 9
1915



**స్వదేశానికి మహాత్ముడు**

దక్షిణాఫ్రికాలో నాటల్ ఇండియన్ కాంగ్రెస్‌కు సారథ్యం వహించి వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపాక భారత్‌కు తిరిగొచ్చిన రోజు.

ఏప్రిల్ 17
1917




**చంపారణ్ సత్యాగ్రహం**

బిహార్‌లోని చంపారణ్‌లో బార్లీ బదులు నీలిమందు తోటల్ని పెంచాలన్న బ్రిటిష్ పాలకుల హుకుంను నిరసిస్తూ రైతులకు మద్దతుగా గాంధీ తొలి సత్యాగ్రహం. అనంతరకాల సత్యాగ్రహ ఉద్యమాలకు ఇదే స్ఫూర్తి.

మార్చి 18
1918



**ఖేడా ఉద్యమం**

ఒకపక్క ప్లేగు వ్యాధి, మరోపక్క కరువు పీడిస్తున్న గుజరాత్‌లోని ఖేడాలో అధిక పన్నులకు వ్యతిరేకంగా రైతు ఉద్యమం. లొంగివచ్చిన ప్రభుత్వం.

ఏప్రిల్ 6
1919



**రౌలట్ నిరసనోద్యమం**

జాతీయోద్యమంపై ఉక్కుపాదం మోపుతూ ప్రభుత్వానికి అసాధారణ అధికారాలు. నిరసనగా సత్యాగ్రహం. జలియన్‌వాలాబాగ్ మారణకాండ. వెయ్యిమంది మృతి.

మార్చి 12
1930



**ఉప్పు సత్యాగ్రహం**

జాతీయోద్యమాన్ని మలుపు తిప్పిన కీలక సత్యాగ్రహం. గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుంచి 384 కిలోమీటర్ల దూరంలోని దండికి గాంధీజీ ప్రారంభించిన పాదయాత్ర. యాత్ర చివరిలో ఉప్పుపై ప్రభుత్వం విధించిన ఆంక్షల ఉల్లంఘన. గాంధీజీ, ఇతర నేతల అరెస్టు.

మార్చి 5
1931

**గాంధీ–ఇర్విన్ ఒడంబడిక**

భారత వైస్రాయ్ లార్డ్ ఇర్విన్‌తో కుదిరిన ఒప్పందం పర్యవసానంగా కాంగ్రెస్ కార్యకలాపాలపై ఉన్న ఆంక్షలు, కార్యకర్తలపై సాధారణ కేసుల ఉపసంహరణ. దండి యాత్రలో పాల్గొన్న వారి విడుదల.

1934

**కాంగ్రెస్‌కు రాజీనామా**

కాంగ్రెస్‌లో సహచర నేతలతో విభేదాలు. పార్టీకి గాంధీ రాజీనామా. దళితులకు ప్రత్యేక నియోజక వర్గాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ గాంధీ దీక్ష చేపట్టాక పుణేలో దళితుల తరఫున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అగ్రవర్ణాల తరఫున మదన్‌మోహన్ మాలవీయల మధ్య ఒప్పందం. అనంతరకాలంలో అగ్రవర్ణాలకు అనుకూలమంటూ వచ్చిన నిందల పర్యవసానంగా పార్టీకి రాజీనామా. 1937లో పార్టీ నేతల వినతితో తిరిగి చేరిక.

ఆగస్టు 8
1942

**క్విట్ ఇండియా ఉద్యమం**

భారత్‌కు అధినివేశ ప్రతిపత్తి ఇస్తామంటూ క్రిప్స్ రాయబారం. కాంగ్రెస్ తిరస్కరణ. స్వాతంత్య్రం తప్ప మరేదీ సమ్మతం కాదని తేల్చిచెప్పాక గాంధీతోపాటు పలువురు నేతల అరెస్టు. బ్రిటిష్ పాలకులు దేశం వదిలిపోవాలంటూ ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమం.

ఆగస్టు 15
1947

**స్వాతంత్ర్య భానూదయం**

దేశాన్ని భారత్, పాకిస్తాన్‌లుగా విభజించి ఇరు దేశాలకూ స్వాతంత్ర్యం ప్రకటిస్తూ ప్రకటన.

జనవరి 30
1948

**మహాభి నిష్క్రమణం**

హిందువుల ప్రయోజనాలు దెబ్బతీస్తూ ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ప్రార్థనా సమావేశంలో ఉన్న గాంధీజీని కాల్చి చంపిన దుండగుడు నాథూరాం వినాయక్ గాడ్సే.



నేటికి..

# అవసరం

**ఆయన్ను జార్జి బెర్నార్డ్ షా**
**హిమాలయాలతో సరిపోల్చాడు...**
**మహామేధావి ఐన్‌స్టీన్‌కైతే ప్రపంచ రాజకీయవేత్తల్లో**
**ఏకైక వివేకవంతుడిగా కనబడ్డాడు...**
**మార్టిన్ లూథర్‌కింగ్‌కు ఆయన క్రీస్తు...**
**బరాక్ ఒబామాకు నిజమైన హీరో...**
**మొత్తంగా అందరికీ మహాత్ముడు!**

ఒక అమ్మ కడుపున జన్మించి మూడు యాభైలు గడిచినా ఇప్పటికీ దేశంలోనే కాదు ప్రపంచమంతటా ప్రభావం చూపుతున్నాడంటే ఆయన నిస్సందేహంగా అసాధారణ మానవుడు. అప్పుడు నెల్సన్ మండేలాకైనా, ఆ తర్వాత కాలంలో మార్టిన్ లూథర్‌కింగ్‌కైనా, పదేళ్ల కిందట అరబ్ ప్రపంచాన్ని చుట్టుముట్టి నియంతలను గడగడలాడించిన ‘జాస్మిన్ విప్లవానికైనా, ఇప్పుడు మనకళ్ల ముందు సాగుతున్న హాంకాంగ్ హక్కుల ఉద్యమానికైనా మహాత్ముడే వెలుగు కిరణాలు విరజిమ్మిన మార్తాండుడు. కాలావధులు దాటి నిరంతరాయంగా స్వేచ్ఛా పరిమళాలను వెదజల్లే బలమైన ప్రభావం. నిన్నమొన్న ప్రధాని నరేంద్ర మోదీ నియోజకవర్గమైన వారణాసిలో ఒక పాఠశాల కుర్రాడు ఆయుష్ చతుర్వేది చేసిన ఉద్వేగభరిత ప్రసంగం గాంధీజీ వర్తమాన అవసరాన్ని నొక్కిచెప్పింది. బక్కపలచగా, ఒంటిపై అంగవస్త్రం తప్ప మరేమీ లేకుండా సర్వసంగ పరిత్యాగిలా కనబడే మహాత్మాగాంధీలో ఏమిటింత గొప్పతనం? ఆయనంటే ఈనాటికీ ఎందుకింత ఆరాధన? ఇదేమిటి... మనమధ్య నుంచి నిష్క్రమించి ఏడు పదులు గడుస్తున్నా ఇంకా ఆయనను భిన్న కోణాల్లో దర్శిస్తూ, కొత్తకొత్తగా విశ్లేషిస్తూ, ఆయన మూర్తిమత్వాన్ని కళ్లకు కడుతూ ఏడాదికో, రెండేళ్లకో పుస్తకాలు వెలువడటమేమిటి? వింతగా లేదూ...?! ఆయనకంటే నాలుగైదేళ్ల తర్వాతే కావొచ్చుగానీ మన దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఆవిర్భవించాక గాంధీజీ రాజకీయాలను, ఆయన ఉద్యమ నిర్వహణ తీరును కమ్యూనిస్టు పార్టీ పలు సందర్భాల్లో నిశితంగా విమర్శించింది. ఆయన వేస్తున్న అడుగులు సరికాదని హెచ్చరించింది. ఆ ఎత్తుగడలన్నీ సామ్రాజ్యవాదులకే అంతిమంగా ఉపయోగపడతాయన్నది. కానీ అది రష్యా తరహాలో ఇక్కడొక లెనిన్‌ను సృష్టించుకోలేకపోయింది. చైనాలో మావోలా విప్లవోద్యమ సారథికి పురుడు పోయలేకపోయింది. వియత్నాంలో వలే ఇక్కడ హోచిమిన్ జాడలేదు. దశాబ్దం క్రితం మన పొరుగునున్న నేపాల్ మాదిరి రాచరికాన్ని కూలదోసిన ‘ప్రచండ’ కూడా లేడు. కానీ గాంధీజీ అప్పుడూ, ఇప్పుడూ ఎప్పుడూ ఉన్నాడు, ఉంటాడు. ఐదు దశాబ్దాల క్రితం మార్క్సిస్టు దిగ్గజం నంబూద్రిపాద్ ఓ మాటన్నారు. భారత రాజకీయాల్లో గాంధీజీ పాత్రను సరిగా విశ్లేషించుకొని, సరైన మార్గాన్ని ఎంచుకోలేకపోవడమే కమ్యూనిస్టుల వైఫల్యానికి ప్రధాన కారణమని వివరించారు. గాంధీజీ మూలాలు గ్రామీణ భారతంలో, అక్కడి జీవనంలో పెనవేసుకుపోయి ఉన్నాయన్నది నంబూద్రిపాద్ విశ్లేషణ. కనుకనే అప్పుడప్పుడూ వెనక్కి తగ్గినట్టు కనబడినా, ఎదురుదెబ్బలు తప్పకున్నా మొత్తంగా గాంధీజీ పురోగమనశీలిగా, లక్ష్య సాధకుడిగా రూపుదిద్దుకున్నాడని ఆయన వివరించారు.

గాంధీజీ ఉద్యమనాయకుడు మాత్రమే కాదు... ఆవిర్భవించబోయే రేపటి భారతానికి ముందే సిలబస్ తయారు చేసిన దార్శనికుడు. ఆయన ప్రవచించిన స్వదేశీ ఆర్థిక వ్యవస్థ, గ్రామ స్వరాజ్యం ఈనాటికీ శిరోధార్యాలు. ఆయన స్పృశించని అంశం లేదు. అందులో స్త్రీ, పురుష సమానత్వం, సంస్కృతి చదువు, నిరాడంబరత, సత్యాహింసలు, ఆధ్యాత్మికత, నైతిక విలువలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, కులమత వివక్షలు, భాష తదితరాలన్నీ ఉన్నాయి. ఆయన దృష్టికోణం నుంచి తప్పుకున్నదేదీ లేదు. సమస్త అంశాలూ ఆయన అధ్యయనం చేశాడు. సరైన దోవ ఏదో చెప్పాడు. అవతలివారి అభిప్రాయాలకు విలువనిచ్చాడు. ఒక్కోసారి వాటికి అనుగుణంగా తానూ మారాడు. అవతలివారి ఆచరణను చూశాడు. అందులో నేర్చుకోదగినవాటిని స్వీకరించాడు. స్వాతంత్ర్యం సిద్ధించాక పాలకులు వాటిని విస్మరించి ఉండొచ్చు. కొన్నిటిని నామమాత్రంగా అమలు చేస్తుండొచ్చు. సమాజంలో చివరాఖరి సాధారణ మానవుడికి సైతం అభివృద్ధి ఫలాలు దక్కినప్పుడే అది నిజమైన స్వాతంత్ర్యం అవుతుందని త్రికరణ శుద్ధిగా నమ్మినవాడు గాంధీజీ. అన్నిటికన్నా పేదరికమే అత్యంత హీనమైన హింస అని చెప్పాడు. ‘మనకో, మనకు తెలిసినవారికో అనుకోనిది ఏదైనా జరిగి ఉండొచ్చు. కానీ అంతమాత్రాన మానవత్వంపై విశ్వాసం పోగొట్టుకోవద్దు’ అని హితవు చెప్పాడు. కొన్ని చుక్కల నీరు కల్మషమైతే సముద్రం చెడిపోయినట్టేనా అని ప్రశ్నించాడు. మన వ్యక్తిగత జీవితాన్ని, సామాజిక జీవితాన్ని, ప్రవర్తనను, చదువులను, కొలువులను, పాలననూ, పద్ధతులను గాంధీ కొలమానంలో ఎప్పటికప్పుడు చూసుకుంటేనే... చూసి సరిచేసుకుంటేనే ఈ దేశం సవ్యంగా మనుగడ సాగించగలదని పదేపదే రుజువవుతోంది.

# నయా నిజం..గాంధీయిజం

ఒక చెంపమీద కొడితే
మరో చెంప చూపించాడు!
బలహీనుడు కాక బలవంతుడా?
సైన్స్ తెలీదు, ఆధునికుడు కాదు!
గోచిగుడ్డ, చేతికర్ర, కళ్లజోడు,
బోడిగుండు.. ఏముంది ఆకర్షణ?
రాట్నం వడకమంటాడు. ఖాదీ అంటాడు.
గ్రామాలకు వెళ్లమంటాడు. ఎలా?
ఇలాంటి మాటలు నలభై, యాభై ఏళ్లుగా
వినబడ్డాయి, కనబడ్డాయి, చర్చించబడ్డాయి,
స్థిరపడ్డాయి! నిజానికి గాంధీ ఇంతేనా?
మరేమీ కాదా?

‘‘రండి! మగటిమి చూపండి! ఈ పూజారులను తన్ని తరమండి. చచ్చినా మారలేరు కనుక, వీరు ప్రగతి విరోధులు! వీరికి హృదయ వికాసం లేదు. శతాబ్దాలుగా పేరుకుపోయిన గుడ్డి నమ్మకాల్లోంచి, ప్రజాహింస నుంచి వీరు పుట్టుకొచ్చారు. ముందుగా కూకటివేళ్లతో పెరికి పారవేయవలసింది వీరి పూజారితనాన్నే. మీ కలుగులలో నుంచి వెలికి రండి! నలుదిక్కులకు చూడండి! దేశదేశాలు ఎలా పురోగమిస్తున్నవో గమనించండి..’’



- డా. నాగసూరి వేణుగోపాల్

ఈ మాటలు ఎవరివో ఊహించగలమా? ప్రచండమైన ఉరుముల్లాంటి ఈ పలుకులు వివేకానంద అన్నారని ఆశ్చర్యం కలగదా? ఇందులో భావం ఎంత తీవ్రంగా ఉందో, భాష అంత పదునుగా ఉంది కనుకనే ఒళ్లు జలదరిస్తుంది. 1972లో సంపాదకీయం కోసం నార్ల వెంకటేశ్వర రావు చేసిన అనువాదమిది. గాంధీజీ వాదనను, వాదనా విధానాన్ని గమనిస్తే అంతటి ఆశ్చర్యం కలుగుతుంది. గాంధీని పోల్చగలిగితే మనకు బుద్ధుడు, ఏసు, వివేకానంద కనబడతారు. మరో రకంగా చెప్పాలంటే గాంధీ వీరందరికన్నా సార్వత్రికంగా, సహజంగా, సర్వతోముఖంగా కనబడతారు. అందుకే ఆయన ఐదు వేల సంవత్సరాల (అది ఎంతైనా కావచ్చు) మానవ చరిత్రలో అపురూపమైన వ్యక్తి.

### బలము, బలహీనత

గాంధీ మానసికంగానే కాదు, శారీరకంగానూ బలవంతుడు. చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తప్ప చివరిదాకా ఆయన జనంలో ఉన్నారు. దేశమంతా స్వాతంత్ర్య సంబరాలలో మునిగి ఉంటే ఆయన నౌకాలిలో గాయపడిన హృదయాలను సముదాయించారు. ఆయన సగటున రోజుకు 18.22 కిలోమీటర్లు నడిచేవారు. బోయర్ యుద్ధ సమయంలో క్షతగాత్రులను మోసుకుంటూ 40 కిలోమీటర్లు నడిచిన దాఖలాలున్నాయి. చివరి దశలోనూ రోజుకు 18 గంటలు పనిచేశారు.

### వైద్యం, వైద్య దృష్టి

ఆశ్రమంలోని ఆసుపత్రికి తెప్పించిన అస్థిపంజరాన్ని బీరువా తీసి పరిశీలనగా చూశాడు గాంధీ. దేహ నిర్మాణం మీకు తెలుసునా అని ఆయనను అడిగినపుడు దేహనిర్మాణం, ఏ అవయవంలో ఎన్ని ఎముకలుంటాయో ఏడెనిమిది నిమిషాలు వివరించాడు. చివరలో అస్థిపంజరం గడ్డం పట్టుకుని, ‘‘నాయనా! నేను కూడా ఏదో ఒకనాడు నీలాగే ఔతానులే’ అన్నాడు. (ఊట్ల కొండయ్య రచన ‘గాంధీపథం’1982 ప్రచురణ నుంచి) 1888 లోనే కాదు, 1908లో సైతం మెడికల్ డిగ్రీ సంపాదించి పూర్తిస్థాయి వైద్యుడిగా స్థిరపడాలని గాంధీ ప్రయత్నించాడు. కానీ, రెండుసార్లు రెండు ఆటంకాలు ఎదురయ్యాయి. ఆయన ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం, హోమియోపతిని ఆదరించారని భావిస్తాం. అయితే ఆధునిక వైద్యరంగంలో పరిశోధకుల వినయాన్ని, చిత్తశుద్ధిని విశేషంగా శ్లాఘించి మన ఆయుర్వేద వైద్యులు మెరుగుపడాలని కోరారు. 1925లో ఆయుర్వేదంలో లైంగిక సామర్థ్యం పెంచుకోవచ్చనే ప్రకటనలను గట్టిగా వైద్యుల మధ్యనే ఖండించారు.

### అప్‌డేట్ అవడం:

గాంధీ అనేక అంశాలపై చూపిన శ్రద్ధ ఆసక్తికరం. ఆయన ఒక అంశంపై ఆసక్తి చూపడం ఆరంభిస్తే, లోతుగా అధ్యయనం చేసేవారు. జీవితంలో చిన్న చిన్న అంశాలు అని మనం భావించే వాటిపై ఆయన చూపిన అమితమైన శ్రద్ధే ఆయన మానవతా వాదంలో విశిష్టత కావచ్చు. అది ఆయన వ్యక్తిత్వానికి మూలం అని ‘బహురూపి’ పుస్తకానికి 1964లో ముందుమాట రాస్తూ జవహర్ లాల్ అంటారు. ఏదైనా ఒక విషయం గురించి పలు అభిప్రాయాలుంటే తాజా అభిప్రాయాన్నే తన అభిప్రాయంగా, సవరించిన అభిప్రాయంగా పరిగణించమంటాడు. ఇది పూర్తి శాస్త్రాభివేశ దృక్పథం.

### నగరాల నిరంతర అహంకారం

ఇవి ఆయన మాటలే. ఇందులో అహంకారం అనేది ఎంత తీవ్రంగా ఉందో, నిరంతరం అనేది అంతలోతుగా ఉంది. ఇందులో వనరుల దోపిడీ, కాలుష్య కారణ వ్యవస్థలు, వినియోగలాలసత, పటాటోపం, కల్లాకపటం.. ఇలా చాలా వర్తమాన కాలపు దుర్గుణాలు మనకు ద్యోతకమవుతాయి. ఈ విధానాలను ఇంత తీవ్రంగా వ్యతిరేకించిన గాంధీ మరెంతటి విప్లవవాది?

### స్త్రీ హృదయం-మాతృభావన

If nonviolence is the law of our being, the future is with woman.. ఈ మాటన్నది గాంధీ అని చాలామంది నమ్మకపోవచ్చు! సైనికబలంలో పురుషుల కంటే స్త్రీలు మెరుగని గాంధీ నిశ్చయం. అహింసా సమరంలో నైతిక బలమే ముఖ్యం.. ఇదీ గాంధీ మహిళాదృష్టి. దేవదాస్ గాంధీ 1900లో జన్మించినపుడు మిగతా పిల్లలను చూసుకుంటూ, కస్తూరిబాయి సుఖప్రసవానికి తనే ఏర్పాట్లు చేశారు. వైద్య పుస్తకాలు చదివి, మంత్రసానిగా మారిన స్త్రీ హృదయం ఆయనది.

### మాతృభాషలకు ఊతం

ఇంగ్లండ్‌లో చదివి, దక్షిణాఫ్రికాలో ప్రజానాయకులై కూడా తన తొలి పుస్తకం ‘హింద్ స్వరాజ్’ను 1909లోనూ, తర్వాత 1925లో ఆత్మకథను గుజరాతీ భాషలో రాశారు. ఇంగ్లిష్ చదువుతోనే మన బానిస ధోరణి అలవడిందని ఆయన అంటారు. నౌకాలి ఉత్పాత సమయంలో పాత్రికేయులు అడిగిన దానికి ఆయన– ‘నా జీవితమే నా సందేశం’ అని బెంగాలీలో చెప్పారు (అప్పుడు కలకత్తాలో ఉన్నారు). సైన్స్ బోధన మాతృభాషలలో జరగాలని అంటారు.

### యంత్రాలను నిరాకరించలేదు

సర్వేపల్లి రాధాకృష్ణ 1969లో రాసిన ‘మహాత్మాగాంధీ’అనే వ్యాసంలో– ‘నా శరీరమే అతి సూక్ష్మాంశాలతో కూడిన అతి సంకీర్ణమైన యంత్రమని నాకు, తెలిసినపుడు నేను యంత్రాల వ్యతిరేకిని ఎలా అవుతాను? చరఖా అనేది యంత్రం.పళ్లు కుట్టుకునే పుల్ల యంత్రం. యంత్రాలను గురించిన వ్యామోహానికి మాత్రం నేను వ్యతిరేకినే’.. ఇది గాంధీ విజన్.

### కలుపుకు పోవడం, సంభాషించడం

1941 జనవరి 26 ‘హరిజన్’పత్రికలో ఇలా రాశారు ‘‘కమ్యూనిస్టులందరూ చెడ్డవారు కాదు. కాంగ్రెస్ వారందరూ దేవతలూ కాదు. కాబట్టి కమ్యూనిస్టు అంటే నాకు దురభిప్రాయం లేదు. కానీ వారి సిద్ధాంతాలను మాత్రం ఆమోదించలేను’’(గాంధీ దర్శనం, ఆదర్శ గ్రంథమండలి ప్రచురణ, 1959, అనువాదం ఉప్పులూరి వెంకట సుబ్బారావు). ఆయన అభిప్రాయాలలో రాజీ లేదు. భాష, వ్యక్తీకరణ కడు సాత్వికం.



క్రమశిక్షణకు పెట్టింది పేరే అయినా చదువులో గాంధీ చురుకైన విద్యార్థి ఏమీ కాడు. ప్రత్యేకించి గణితం, భూగోళ శాస్త్రాల్లో ఆయనకు మార్కులు తక్కువొచ్చేవి.



గాంధీ కన్నా కస్తూర్బా వయస్సులో ఆరు నెలలు పెద్దది. 1869లో కస్తూర్బా ఏప్రిల్ 11న జన్మిస్తే, గాంధీజీ అక్టోబర్ 2న పుట్టారు. వాళ్లకు పదమూడేళ్ల వయసులో పెళ్లి జరిగింది.

అన్ని వ్యాయామాల్లోకీ నడకను రాజులా భావించారు గాంధీజీ. లండన్‌లో లా విద్యార్థిగా ఉన్నప్పుడు రోజూ 10–15 కిలోమీటర్లు నడిచేవాడు. అదే ఆయన జీవితాంతం కొనసాగింది. 1930లో జరిగిన దండి సత్యాగ్రహంలో ఆయన రోజుకు సుమారు 17 కిలోమీటర్లు నడిచాడు. అప్పుడు ఆయన వయసు 61 ఏళ్లు.

# విద్యపై మహాత్ముని కలలు ..నేటి తరానికి అవసరాలు



- వాడ్రేవు చినవీరభద్రుడు

మహాత్ముడు పుట్టి నేటికి నూటయాభై ఏళ్ళు. ఆయన జీవితకాలంలో వెలిబుచ్చిన అభిప్రాయాల్లోనూ, సాగించిన ఆలోచనల్లోనూ, చేపట్టిన ప్రయోగాల్లోనూ ఇప్పటి ప్రపంచానికి పనికొచ్చే అంశాలేమైనా ఉన్నాయా అనే ఒక చర్చ ప్రపంచవ్యాప్తంగా నడుస్తున్నది. ఆయన నిర్వహించింది కేవలం ఒక దేశానికి, ఒక జాతికి, ఒక కాలానికి మాత్రమే పరిమితమైన చారిత్రక పాత్ర కాదనేది దాదాపుగా అందరూ గుర్తిస్తున్నారు. వివిధ దేశాలకీ, వివిధ జాతులకీ, వివిధ మానవ సమూహాలకీ, వివిధ కాలాలకీ కూడా స్ఫూర్తినివ్వగల ప్రాసంగికత వాటిలో ఉందనేది ఒక మెలకువ.

కొందరు ఆయనలో ఒక పౌరహక్కుల ఉద్యమకారుణ్ణి చూస్తున్నారు. ఆధునికతకు ప్రత్యామ్నాయ జీవనశైలిని అన్వేషించినవాడిగా కొందరు ఆయన్ని గుర్తిస్తున్నారు. కొందరి దృష్టిలో ఆయన స్థానిక గ్రామ స్వపరిపాలనను ప్రోత్సహించిన పోస్ట్ మాడర్న్ రాజనీతిజ్ఞుడు, పాలనా తత్త్వవేత్త. మరికొందరికి ఆయన వస్త్రధారణలో, ఆహార వినియోగంలో, ఆశ్రమ నిర్వహణలో కొత్త పద్ధతుల్ని పాటించిన మనిషి. ఏమైనప్పటికీ మారుతున్న కాలంతో పాటు ఆయన్ని అర్థం చేసుకునే పద్ధతిలో కూడా మార్పు వస్తోంది. ఒకప్పుడు ఆయన్ని యంత్రనాగరికతకీ, ఆధునిక సాంకేతికతకీ వ్యతిరేకిగా భావించారు. కాని, సైన్సు అంటే నిజమైన అర్థం నిరంతర ప్రయోగ శీలత్వమనీ, కొన్ని మూఢవిశ్వాసాలకు కట్టుబడి ఉండకపోవడమనీ అనుకుంటే, గాంధీజీ, తన జీవితం పొడుగునా, అనుదినం, అనుక్షణం ప్రయోగాల వెనక ప్రయోగాలు చేపడుతూనే ఉన్నారనీ, ఆ అర్థంలో ఆయన జీవన పద్ధతి నిజమైన వైజ్ఞానిక పద్ధతి అనే భావన కూడా ఇటీవల బలపడుతున్నది.

రానున్న రోజుల్లో గాంధీజీని ప్రపంచం ఏ పార్శ్వంలో ఎక్కువగా గుర్తుపెట్టుకుంటుంది, ఏ అంశంలో ఆయన్ను ఎక్కువ అనుసరించడానికి సిద్ధపడుతుందనేది ఈ క్షణాన తేల్చి చెప్పడం కష్టం. నానాటికీ, ప్రపంచం ఒక గ్లోబల్ మార్కెట్‌గా మారుతూ, పర్యావరణాన్ని కొల్లగొడుతూ, అత్యధిక సంఖ్యాకులకి అస్థిరతనీ, అభద్రతనీ కలిగించే ఆర్థిక–రాజకీయ వ్యవస్థగా రూపొందుతున్న కాలంలో, వ్యక్తి విశ్వాసాలకీ, గౌరవానికీ, మానవ మర్యాదకీ భంగం వాటిల్లుతున్న కాలంలో, బహుశా, మనిషి తన అస్తిత్వ గౌరవాన్ని తాను కాపాడుకునే ప్రయత్నంలో గాంధీజీని ముందుముందు మరింత శ్రద్ధగా పరికిస్తాడని భావించవచ్చు.

కానీ, నేనేమనుకుంటానంటే, తాను విద్య పట్ల చేపట్టిన ప్రయోగాలూ, నవీన విద్య గురించి కన్న కలలూ, ప్రకటించిన అభిప్రాయాల వల్ల గాంధీజీ నేడు మునుపెన్నటికన్నా మిన్నగా ప్రాసంగికుడవుతున్నాడని. విద్య గురించి ఆయన జీవితకాలం పొడుగుతా తనకై తానుగా ఏర్పరచుకుంటూ వచ్చిన స్పష్టత, ఈనాడు మనకి మరింత స్పష్టతనిచ్చేదిగా కనిపిస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే, 1921 దాకా తన జీవిత గమనాన్ని ఆయన ఆత్మకథగా రాసుకున్నప్పుడు 'సత్యంతో నా ప్రయోగాలు'అని పేరుపెట్టాడు గాని, గాంధీజీ తన పూర్తి జీవితాన్ని ఆత్మకథగా రాసుకుని ఉంటే 'విద్యతో నా ప్రయోగాలు'అని పేరు పెట్టి ఉండేవాడనిపిస్తుంది.


మనం ఆధునిక విద్యగా భావిస్తున్నది పద్దెనిమిదో శతాబ్దిలో యూరోప్‌లో వికాస యుగం కాలంలో రూపుదిద్దుకున్నది. సైన్సు, రీజను, ప్రజాస్వామ్యం, లౌకిక భావజాలం పునాదులుగా రూపుదిద్దుకున్న ఆ విద్యావ్యవస్థ, మధ్యయుగాల దాస్యం నుంచి మానవాళిని విడుదల చేస్తుందనీ, కుల, మత, ప్రాంత, లింగ, వర్ణ ప్రాతిపదికలతో నిమిత్తం లేకుండా, మనుషులందరినీ, సమాన పౌరులుగా తీర్చిదిద్దుతుందనీ ఒక ఆశ కల్పించింది. కానీ పందొమ్మిదో శతాబ్ది నాటికే, ఆధునిక విద్యా పద్ధతులపట్ల అనుమానం మొదలై, ఇరవయ్యవ శతాబ్దం చివరికి వచ్చేటప్పటికి, అది కొందరికి అమృతాన్నీ, అత్యధికులకు విషాన్నీ పంచే మోహినీ మాయగా బయటపడింది. మనుషుల్ని విడదీసే రాక్షస శక్తుల్లో, అసమానతల్ని కొనసాగించే వాటిలో అన్నిటికన్నా బలమైనదిగా, 21వ శతాబ్దం నాటికి, ఆధునిక విద్య పూర్తిగా స్పష్టపడింది. మధ్యయుగాల్లో కులం, మతం, వర్ణం, లింగం, జాతి వంటి ప్రాతిపదికలు మనుషుల మధ్య సృష్టించిన అసమానతల కన్నా, ఆధునిక కాలంలో ఆధునిక విద్య మనుషుల మధ్య పైకెత్తిన అడ్డుగోడలు మరింత అనుల్లంఘనీయాలుగా కనిపిస్తున్నాయి.

ఆధునిక విద్యలోని ఈ అమానుషత్వాన్నీ, హృదయ రాహిత్యాన్నీ రూసో, టాల్‌స్టాయి, థోరో, రస్కిన్ వంటి వారు పసిగట్టకపోలేదు. దాన్ని ప్రక్షాళన చేయడానికి కొన్ని ప్రయోగాలు చేపట్టకపోలేదు. కానీ, వారందరికన్నా కూడా గాంధీజీ చేపట్టిన ప్రయోగాలు మరింత ప్రభావశీలమైనవీ, మరింత ఆచరణ సాధ్యమైనవీను.

ఆధునిక విద్యకి ఒక ప్రత్యామ్నాయాన్ని అన్వేషించవలసిన అవసరం గాంధీజీకి 1897 లోనే కలిగింది. టాల్‌స్టాయి ఫారంలోనూ, ఫీనిక్సులోనూ మొదలైన ప్రయోగాల అనుభవాల మీద ఆయన 1907లో రాసిన హింద్ స్వరాజ్‌లో మొదటిసారిగా విద్య గురించి ఒక స్పష్టత కోసం ప్రయత్నించాడు. కేవలం విషయ పరిజ్ఞానం విద్య కాదనీ, మనిషి తన ప్రవృత్తినీ, ఇంద్రియాల్నీ అదుపు చేసుకోవడమెట్లానో తెలుసుకోకపోతే ఆ విద్య నిరుపయోగమనే మెలకువ అందులో కనిపిస్తుంది. దాదాపుగా వందేళ్ళ తరువాత, 1996లో యునెస్కో వెలువరించిన 'లెర్నింగ్: ద ట్రెజర్ విదిన్'లో ప్రపంచ విద్యావేత్తలు దీన్నే 'లెర్నింగ్ టు లివ్ టుగెదర్'అన్నారు. కేవల విషయ పరిజ్ఞానం, సమాచార సంచయం మనిషిని మనిషికి చేరువగా తీసుకుపోదు. విద్య పరమార్థం సాంఘికీకరణ అని మనం నమ్మినట్లయితే, అది మనిషి తన ప్రవృత్తినీ, ఇంద్రియాల్నీ అదుపు చేసుకోవడం ద్వారానే సాధ్యపడుతుందని నేడు మనకి అర్థమవుతున్నది.

1915లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత, గాంధీజీ శిష్యబృందానికి టాగోర్ శాంతినికేతనంలో ఆశ్రయమిచ్చాడు. గాంధీజీకి శాంతినికేతన్ నచ్చిందిగాని అందులో నలుగురూ కలిసి కాయకష్టం చేసుకోవడానికి తావులేదు. అక్కడ బుద్ధికీ, హృదయానికీ విద్య ఉందిగాని, శరీరానికి లేదు. అందుకని, దేహానికీ, బుద్ధికీ, హృదయానికీ ఏక కాలంలో శిక్షణనివ్వగల ఒక సమగ్ర విద్య కోసం గాంధీజీ అన్వేషణ మొదలుపెట్టాడు. 1916–17 చంపారన్ సత్యాగ్రహ కాలంలో ఆయన మనసంతా అటువంటి ఒక పాఠశాల ప్రారంభించడం మీదనే ఉండింది. చంపారన్ రైతులకోసం తాము ఒక కమిటీ వేస్తున్నామనీ, ఇక గాంధీజీకి అక్కడ ఏమి పని ఉంటుందని తనని ప్రశ్నించిన బిహారు లెఫ్టినెంటు గవర్నరుతో– చంపారన్‌లో తిరిగిన తరువాతనే తన సామాజిక లక్ష్యాలు తనకి స్పష్టంగా అర్థమయ్యానీ, అవి 'సఫాయి, స్వాస్థ్య, శిక్షా'అన్నాడు ఆయన.

1917 నుంచి 1948 దాకా గాంధీజీని భారత జాతీయోద్యమం రాజకీయ పోరాటాల వైపు తిప్పకపోయి ఉంటే, ఆయన పూర్తికాలపు విద్యావేత్తగా ప్రయాణించి ఉండేవాడు. కాని, రాజకీయ పోరాటాల మధ్య విరామం లభించినప్పుడల్లా ఆయన విద్యాప్రయోగాలు చేపడుతూనే ఉన్నాడు. ఆ ప్రయోగాల మొదటి ముసాయిదాగా ఆయన 1937లో ప్రకటించిన నయీ–తాలీం (నవీన విద్య)ను పేర్కొనవచ్చు.



'న్యూటెస్టమెంట్‌లోని ఈ వాక్యాలు తనను బాగా ఆకర్షించాయని గాంధీజీ చెప్పుకున్నారు. "ఎవరు ఎట్లు చేయుదురో వారు అట్టి ఫలమును అనుభవింతురు. కాని అన్యాయంతో అన్యాయాన్ని పారద్రోలలేరు. ఎవరైనా నీ కుడిచెంప మీద దెబ్బ కొడితే నీవు నీ ఎడమ చెంప కూడా వానికేసి తిప్పు. ఎవరైనా నీ వుత్తరీయం లాగుకుంటే నీ ఆంతర్యం కూడా ఇచ్చివేయి."

'భగవద్గీతను చదివినప్పుడు గాంధీజీ మనసులో నాటుకుపోయిన శ్లోకాలు ఇవి. ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే సంగాత్సం జాయతే కామః కామత్ క్రోధోభిజాయతే! క్రోధాద్భవతి సంమోహః సమ్మోహత్ స్మృతి విభ్రమఃస్మృతి భ్రంశాద్బుద్ధినాశో బుద్ధి నాశాత్ ప్రణశ్యతి!! (శబ్దాది విషయాలను సదా ధ్యానిస్తూ ఉంటే మనిషికి వాటియందు ఆకర్షణ కలుగును. దానివల్ల కోరిక పుట్టును. కోరిక ద్వారా కోపం సంభవించును! కోపం వల్ల అవివేకం సంభవించును. అవివేకం వల్ల మతిభ్రమ కలుగును. దానివల్ల బుద్ధి నశించును. బుద్ధి నశించినచో సమస్తం హతమగును!!)


## చేనేత మగ్గంపై జాతిపిత చిత్రం



**సిరిసిల్ల:** పేపర్‌పై స్కెచ్‌తో బొమ్మలు వేయడానికి కళ ఉండాలి. అలాంటిది చేనేత మగ్గంపై విభిన్న రంగుల దారాలు వినియోగించి.. ఆసుపోసి.. భారతదేశ పటం, జాతీయ జెండా రంగులు, అందులో రాట్నం వడుకుతున్న జాతిపిత మహాత్మాగాంధీ చిత్రం ఆవిష్కరించడం అద్భుతమే. ఒక్కపోగు మారినా.. చిత్రం రూపురేఖలు మారిపోతాయి. చేసిన శ్రమంతా వృథా అవుతుంది. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెల్ది హరిప్రసాద్.. చేనేత కళాకారుల అద్భుత పనితనం మరోసారి ప్రపంచానికి చాటి చెప్పారు. జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని చేనేత మగ్గంపై నేశారు. జాతీయ స్థాయిలో 'నేషనల్ హ్యాండ్ లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ)'అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా చేనేత కళాకారులకు పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీలకు సిరిసిల్ల నుంచి వెల్ది హరిప్రసాద్ సిద్ధమయ్యారు. 36 ఇంచుల వెడల్పు, 50 ఇంచుల పొడవుతో ఒకే వస్త్రంపై అద్భుతం ఆవిష్కరించారు. ఇందుకోసం రూ.6 వేల వరకు ఖర్చయిందని హరిప్రసాద్ తెలిపారు.

## గాంధీ ఆశీస్సులతో ఐపీఎస్ అయ్యాడు

ఒక ఏడేళ్ల అనాథ పిల్లవాడు గాంధీజీ ఆశీస్సులు అందుకొని ఆ తరువాత హైదరాబాద్ పోలీసు సర్వీసెస్‌కు(ఇప్పుడు ఐపీఎస్) ఎంపికయ్యాడు. ఆయనే 94 ఏళ్ల గొంగిడి రాఘవరెడ్డి.



జనగామ జిల్లా పెంబర్తికి చెందిన రాఘవరెడ్డి తల్లిదండ్రులు రామసుబ్బమ్మ, అనంతరెడ్డి ప్లేగువ్యాధితో చనిపోయారు. దాంతో రాఘవరెడ్డి ఏడెళ్ల వయస్సులో మల్కాజ్‌గిరిలోని మేనత్త ఇంటికి వచ్చాడు. అదే సమయంలో జాతీయోద్యమనేత రావి నారాయణరెడ్డి ఆహ్వానం మేరకు హైదరాబాద్‌లోని కాచిగూడలో హరిజన విద్యార్థుల హాస్టల్ ప్రారంభోత్సవానికి 1936 మార్చి 9న గాంధీజీ వచ్చారు. ''ఈ అబ్బాయి తల్లిదండ్రులు చనిపోయారు. ఈ హాస్టల్లోనే ఉండి చదువుకుంటాడు''అని గాంధీజీకి నారాయణరెడ్డి చెప్పారు. ''వెంటనే గాంధీజీ నన్ను దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చోబెట్టుకొన్నారు. బాగా చదువుకోవాలి. మంచిపేరు తెచ్చుకోవాలి''అని ఆశీర్వదించారని రాఘవరెడ్డి అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. గాంధీజీ చెప్పినట్లుగానే రాఘవరెడ్డి కష్టపడి చదివి అప్పట్లో హైదరాబాద్ పోలీసు సర్వీసెస్‌కు ఎంపికయ్యారు.

## బాపూజీకే తొలి పూజ

**డిచ్‌పల్లి:** ఆ గ్రామస్తులు తమ ఇళ్లల్లో ఏ శుభకార్యం జరుపుకోవాలన్నా ముందుగా గ్రామ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహానికి తొలి పూజ నిర్వహిస్తారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నర్సింగాపూర్ (కొత్తపేట్)లో 1961 సంవత్సరం నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. చిన్నారులకు నామకరణం, నూతన వస్త్రాలంకరణ, నిశ్చితార్థం, పెళ్లిళ్లు, సత్యనారాయణ వ్రతం, గ్రామ దేవతలు, ఆలయాల్లో జాతర, పండుగ రోజులు.. ఇలా శుభకార్యం ఏదైనా తొలి పూజ బాపూజీ విగ్రహానికి చేస్తారు. ముందుగా గాంధీ విగ్రహాన్ని పాలతో అభిషేకించి నీళ్లతో శుభ్రం చేస్తారు. పూలమాల వేసి కొబ్బరి కాయలు కొట్టి పూజిస్తారు. ఇలా చేస్తే బాపూజీ దీవెనలతో తమకు అంతా మంచే జరుగుతుందని గ్రామస్తులు భావిస్తారు. గ్రామంలో కుల, మతాలకతీతంగా ఇప్పటికీ ఈ ఆచరణ కొనసాగుతోంది.

# నాన్న భుజాలపైకి ఎక్కి గాంధీని చూశాను



- జమున


"మహాత్మా గాంధీగారిని చూడటం కోసం ఆ రోజు అర్ధరాత్రి రెండు గంటలకు మా ఇంట్లో వాళ్లందరం బయలుదేరాం. ఆయన్ని చూడటం కోసం ఆ రాత్రంతా ప్రయాణం చేసి తెల్లవారుజాముకల్లా అక్కడకు చేరుకున్నాం. ఆ రోజు ఆయన్ను చూడటం నా అదృష్టంగా భావిస్తున్నాను''అన్నారు ప్రముఖ నటి జమున. ఈ అక్టోబర్ 2న మహాత్మా గాంధీ 150వ జయంతి. ఈ సందర్భంగా గాంధీ గురించి జమున మాట్లాడుతూ – ''మేము అప్పుడు తెనాలికి దగ్గరలోని దుగ్గిరాలలో ఉండేవాళ్లం. నాకు అప్పుడు తొమ్మిది, పదేళ్లుంటాయేమో. అప్పటికే గాంధీగారి గురించి చాలా విన్నానేమో. ఆయన వస్తున్నార ని తెలిసి ఆయన్ను ఎప్పుడెప్పుడు కలుస్తానా? అని ఎదురు చూశాను. దానికి కారణం లేకపోలేదు. ఓ రోజు నేను స్కూల్ నుండి వచ్చేటప్పటికి మా అమ్మ ఏడుస్తూ కనిపించింది. 'ఏంటీ.. అమ్మ ఏడుస్తుంది'అని అడిగాను. ఆ బ్రిటీషు వారు భగత్ సింగ్‌ను ఉరి తీసిన సంగతిని గుర్తు చేసుకుంటూ ఏడ్చిందట. ఆ సంఘటన నా మనసులో నిలిచిపోయింది. మా అమ్మ కౌసల్యా దేవి తెనాలికి చెందిన కొల్లా కాశయ్య, కొల్లా పేరమ్మతో కలసి గాంధీ గారి బాటలో భారతీయులు ఖద్దరునే ధరించాలి అనే నినాదంతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో వారందరినీ జైల్లో కూడా పెట్టారట. అలా అప్పటినుండి నాకు తెలియకుండానే నా ఒంట్లో దేశభక్తి నరనరాన జీర్ణించుకుపోయింది. అప్పుడు మా స్కూల్లో కూడా పిల్లలందరం మహాత్మా గాంధీకి జై, భారత్ మాతాకి జై, క్విట్ ఇండియా అంటూ నినాదాలు చేసేవాళ్లం. ఆ టైమ్‌లోనే గాంధీ గారు మా ఊరు వస్తున్నారని తెలిసింది. నా ఆనందానికి, మా అమ్మ ఆనందానికి అవధులు లేవంటే నమ్మండి. ఆయన్ను ఎప్పుడెప్పుడూ చూస్తానా అన్నట్లు ఉండేది. ఆ రోజు రానే వచ్చింది. అది 1946వ సంవత్సరం అనుకుంటా. భారత దేశమంతా గాంధీగారితో పాటు నడుస్తుందంటే అతిశయోక్తి కాదేమో. ఎక్కడ చూసినా ప్రజలు దేశభక్తితో ఊగిపోతుండేవారు. మా ఊరి నుండి రెండెడ్ల బండిలో అమ్మానాన్న, నేను, తమ్ముడు బయలుదేరాం. ట్రైన్‌ని తెనాలి–దుగ్గిరాల మధ్యలో ఓ చోట ఐదు నిమిషాల పాటు ఆపుతారు అని ముందుగానే రైల్వే డిపార్ట్‌మెంట్ వారు తెలపడంతో ప్రజలందరూ అక్కడికి చేరుకున్నారు. అప్పుడే ఆకాశాన్ని చీల్చుకుని సూర్యుడు చిన్నగా బయటకు వస్తున్నాడు. టైమ్ ఆరుగంటలు దాటి ఉంటుంది. ట్రైన్ ఒక్కసారిగా ఆగింది. ఆ ఎర్రెర్రని సూర్యుని మధ్యలో నుండి గాంధీగారు నవ్వుకుంటూ చిన్నగా బయటకు వచ్చారు. రైల్వేవారు ట్రాక్ దగ్గర బల్లలతోటి చిన్న స్టేజి లాంటిది ఏర్పాటు చేశారు. గాంధీగారు నలువైపులా చూస్తూ అందరికీ అభివాదం చేశారు. నేను మా నాన్నతో నాకు గాంధీగారు సరిగ్గా కనపడట్లేదు అని చెప్పటంతో ఆయన భుజాలపైకి ఎక్కించుకుని నాకు ఆయన్ను చూపించారు. ఆ రోజు నేను చూసిన గాంధీగారి గురించి ఇంత గుర్తుగా చెబుతున్నానంటే ఆ సంఘటనని నేను ఎన్నిసార్లు తలచుకొని ఉంటానో ఊహించుకోవచ్చు. ఆ రోజు ఆదివారం కావటంతో నేను ఆయన మాటలను వినలేకపోయాను. దానికి కారణం ఆయన ఆదివారం మౌన వ్రతం చేస్తారు. చిన్న వయసులో జరిగిన ఈ సంఘటన నా మనసులో బలంగా నాటుకుపోయింది. ఇప్పటి పిల్లలకు మన స్వాతంత్ర్యోద్యమం గురించి, ఎందరో మహనీయుల త్యాగఫలం ఈ భారతదేశం అని చాటి చెప్పాలి. నేను సినిమాల్లోకి వచ్చిన తర్వాత 'భాగ్యరేఖ'అనే సినిమాకి జాతీయ అవార్డు లభించింది. ఆ సందర్భంగా అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. అప్పుడు వారిని కలిసే అవకాశం లభించింది. సినిమా ఇండస్ట్రీలో ఈ ముగ్గురిని కలిసిన అదృష్టవంతురాలిని నేనే అనుకుంటాను. నేను కాకుండా సినిమావాళ్లలో అల్లు రామలింగయ్యగారు గాంధీగారిని కలిసారని ఓసారి మాటల సందర్భంలో చెప్పారు. ఇంతే కాకుండా నాగేశ్వరరావు గారితో కలిసి నేను నటించిన 'దొంగరాముడు'సినిమాలో ఓ పాట ఉంది. 'భలే తాత మన బాపూజీ.. బాలల తాతా బాపూజీ...'పాటలో నటించటం నాకు ఎంతో సంతోషం. ఎందుకంటే ఇప్పటికీ గాంధీ జయంతి అనగానే ఆ పాటను పాడుకుంటూ ఉంటారు. ఇదంతా ఓకే కానీ, మనకు స్వాతంత్ర్యం సిద్ధించటానికి కార ణం అయిన బాపూగారి జీవితంతో ఒక్క తెలుగు సినిమా కూడా రాకపోవటం చాలా బాధాకరం. బ్రిటీషు వాడైన రిచర్డ్ అటెన్‌బరో 'గాంధీ'చిత్రాన్ని తెరకెక్కించి ఎంతో మన్ననలను పొందారు. ఇప్పటి పరిస్థితుల్లో కూడా గాంధీ గురించి చెప్పాల్సిన బాధ్యత సినిమావారిపై ఉంది''అన్నారు.

సేకరణ : శివ మల్లాల

సాక్షి హైదరాబాద్ | బుధవారం | అక్టోబర్ | 2 | 2019 | www.sakshi.com



పోస్టుకార్డుల్ని తక్కువ ఖర్చుతో సమాచారాన్ని బదిలీ చేసుకోగలిగే వ్యవస్థగా చూశాడు గాంధీ. వేల ఉత్తరాలు రాశాడు. కాకపోతే ఆయన చేతిరాత అంత బాగుండేది కాదు. ఆ చింత ఆయనకు జీవితాంతం ఉండింది.



మంచి దస్తూరి చదువులో భాగంగా ఉండాలనేది గాంధీజీ అభిప్రాయం. చేతిరాత మెరుగుపరుచుకోవడానికి పూవులు, పిట్టలు లాంటివి పిల్లలతో చిత్రంపజేసినట్లయితే ఫలితం ఉంటుందనుకున్నారు.

బారిస్టర్ చదవడానికి ఓడలో లండన్ వెళ్లేందుకు సన్నాహాలు చేసుకున్నారు గాంధీజీ. కానీ నిషిద్ధమైన సముద్రయానాన్ని చేస్తున్నాడన్న కారణంతో గాంధీజీని కులబహిష్కరణ చేయడానికి కొందరు పెద్దలు పూనుకున్నారు. రూపాయి పావలా జరిమానా కూడా విధించారు. కానీ గాంధీ వారిని లెక్క చేయలేదు.



# మహాత్ముడిని మలిచిందెవరు?



గాంధీజీని తమ వ్యక్తిత్వం చేత, ఆలోచనల చేత ప్రభావితం చేసిన వ్యక్తులు కొందరున్నారు. అందులో రాయచంద్ ఒకరు. మహాత్ముడి ఆత్మకథలో రాయచంద్ పేరుతో ఒక ప్రకరణం ఉంటుంది. ఇంగ్లండులో బారిస్టర్ చదువు పూర్తి చేసుకుని భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు కలిశారతన్ని. అప్పటికి రాయచంద్‌కి పాతికేళ్లు. గాంధీ కంటే సుమారు రెండేళ్లు పెద్ద. కవి. శతావధాని కూడానట. అతని ధారణ, అవధాన ప్రజ్ఞలు విశేషమైనవి. కానీ గాంధీని ఎక్కువగా ఆకట్టుకున్నవి మాత్రం అతని విశాల శాస్త్ర జ్ఞానం, నిర్మల ప్రవర్తన, ఆత్మజ్ఞానంపై అతనికున్న తీవ్రమైన తపన. రాయచంద్ రత్నాల వ్యాపారి. దుకాణంలో వ్యాపారం సాగుతూ ఉండగా అతను ధ్యాననిమగ్నుడై ఉండడం అనేకసార్లు చూశానని రాశారు గాంధీ. మన లౌకిక కార్యకలాపాలకు ఆధ్యాత్మిక సాధనకు మధ్య ఘర్షణ ఉండాల్సిన పని లేదనీ రెండింటినీ ఏక కాలంలో నడిపించుకోవచ్చుననీ, పైపెచ్చు ఆధ్యాత్మిక సాధనవల్ల లౌకిక కార్యక్రమాల నిర్వహణ సులువౌతుందని రాయచంద్ వల్ల గాంధీకి తట్టి ఉండొచ్చు. అందరినీ సమదృష్టితో చూసే అతని వైఖరి కూడా గాంధీకి ఒక ప్రేరణగా పనిచేసి ఉండొచ్చు. భగవంతుణ్ణి గురించి తెలిసీ తెలియక కొట్టుమిట్టాడుతున్నప్పుడు తనకు రాయచంద్ అండగా కనిపించే వాడన్నారు గాంధీ. ప్రత్యక్ష సాంగత్యంవల్ల మనస్సులో నాటుకుపోయిన వ్యక్తి అతను.

గాంధీని ప్రభావితం చేసిన మరొక వ్యక్తి గోపాలకృష్ణ గోఖలే. స్ఫటికమంత స్వచ్ఛత, గొర్రెపిల్లంత సాత్వికత, సింహమంత ధైర్యం కల వ్యక్తి అన్నారు ఆయన గురించి చెబుతూ. దక్షిణాఫ్రికా నుంచి గాంధీని భారత రాజకీయ రంగంలోకి రప్పించింది గోఖలేనే. రాజకీయరంగంలో 'అత్యంత పరిపూర్ణుడై'న మనిషిగా ఆయనను గుర్తించి తన రాజకీయ గురువుగా స్వీకరించారు గాంధీ.

గాంధీజీపై ఎనలేని ప్రభావాన్ని చూపించిన పుస్తకం భగవద్గీత. చిత్రంగా దాన్ని ఆయన మొదట చదివింది ఇంగ్లండులో. ఇంగ్లిషులో. లా కోర్సు రెండవ సంవత్సరంలో ఉండగా ఎడ్విన్ ఆర్నాల్డ్ గీతకు రాసిన ఆంగ్లానువాదం 'ది సాంగ్ సెలెస్టియల్'ని చదివారు. తర్వాత దాన్ని జీవితాంతం విడిచిపెట్టలేదు. చదవడమే కాదు సంస్కృతం నుంచి గుజరాతీ భాషలోకి అనువదించి తన వ్యాఖ్యలు జోడించుకుంటూ వెళ్లారు. యంగ్ ఇండియా పత్రికలో 1925లో ఒకసారి భగవద్గీతకు తనకు ఉన్న సంబంధాన్ని ఇలా చెప్పారు. 'సందేహాలు నన్ను వెంటాడినప్పుడు, నిరాశ అలముకుని ఎక్కడా ఆశా కిరణం అన్నది కానరానప్పుడు నేను గీతను ఆశ్రయిస్తాను. ఒక శ్లోకం ఏదో కనిపిస్తుంది. నన్ను స్వస్థ పరుస్తుంది. ముంచెత్తే దుఃఖం మధ్య నాకు చిరునవ్వు మొలుస్తుంది. నా జీవితం నిండా ఎన్ని విషాద ఘట్టాలున్నాయో! అవి నన్ను ఏమీ చెయ్యలేకపోయాయంటే భగవద్గీత బోధ కారణం దానికి' అన్నారు. గాంధీ కర్మయోగి. సంఘ సంస్కరణ నుంచి, రాజకీయ పోరాటం నుంచి, జాతీయ ఉజ్జీవన ఉద్యమం నుంచి ఎన్నడూ వైదొలగలేదు. ఏ బయటి ప్రభావాలూ తనని అంటనివ్వలేదు. ఏ ప్రలోభానికీ తగ్గలేదు. 'కాంక్షా రాహిత్యం'అని తన భాషలో చెప్పిన గీతాసారానికి కట్టుబడి ఉన్నారు. ప్రేమతో కూడిన పోరాటాన్ని, ద్వేషంలేని యుద్ధాన్ని కొనసాగించారు.

**మనుషులు శూన్యంలోంచి రారు. మనుషులలో నుంచే వస్తారు. ఎన్నో ప్రభావాల్ని కలుపుకుంటూ ఎదుగుతారు. మహాత్ములైనా సరే.**

తమ రచనల ద్వారా గాంధీజీని ప్రభావితం చేసిన వ్యక్తులు కొందరున్నారు. వాళ్లలో ముఖ్యులు ముగ్గురు. హెన్రీ డేవిడ్ థోరో, టాల్‌స్టాయ్, రస్కిన్.

థోరో (1817–1862) అమెరికన్. కవి, వ్యాసకర్త, ప్రధానంగా తాత్వికుడు. ఆయన రాసిన 'వాల్డెన్'గ్రంథం, 'రెసిస్టెన్స్ టు సివిల్ గవర్నమెంట్'అనే వ్యాసం గాంధీజీని బాగా ప్రభావితుణ్ణి చేశాయి. థోరో వాదనా పటిమ పదునైనది, అది మనల్ని నిరుత్తరుల్ని చేస్తుంది అంటారు గాంధీ. థోరో నైతికతకి ఆయన ముగ్ధులైపోయారు. 1906లో ఆయన 'వాల్డెన్' చదివారు. దాని నుంచి కొన్ని సూత్రాలను గ్రహించి, అమలు పరిచాను అని చెప్పారు. తన సహచరులచేత ఆ పుస్తకాన్ని చదివించారు కూడా. పన్నుల నిరాకరణను, సహాయ నిరాకరణను, ప్రకృతి ఒడిలో నిరాడంబర జీవితాన్ని, పర్యావరణ స్పృహని, ప్రత్యక్ష కార్యాచరణని, అంతరాత్మ ప్రబోధానుసరణ ఆవశ్యకతని బోధించాడు థోరో. వీటినన్నింటినీ మనం గాంధీ జీవితంలో చూస్తాం.

గాంధీని బలంగా ప్రభావితం చేసిన మరో వ్యక్తి టాల్‌స్టాయ్ (1828–1910). ప్రపంచ ప్రఖ్యాత రచయిత. సంపన్న గృహస్థుడు. 57వ ఏట సంపదను వదులుకుని నిరాడంబర జీవితం గడిపాడు. గాంధీ జైలు నిర్బంధానికి గురైన సందర్భంగా వాటిని తీరిగ్గా చదవడం తటస్థించింది. 'ది కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ విదిన్ యు' అనే పుస్తకం, 'క్రిస్టియానిటీ పేట్రియాటిజం'అనే వ్యాసం గాంధీని బాగా ఆలోచింపజేశాయి. ఎంతగా ప్రభావితుడయ్యారంటే టాల్‌స్టాయ్ ఆశ్రమం అనే పేరుతో దక్షిణాఫ్రికాలో ఉండగా ఒక ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఇద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి కూడా. నేను మీ అనుచరుణ్ణి అని వినయ పూర్వకంగా రాశారు ఒక ఉత్తరంలో టాల్‌స్టాయ్‌కి. శారీరక శ్రమ, కనీస వసతులతో జీవించడం, ఆస్తిని కూడబెట్టకపోవడం, జీవహింసా వైముఖ్యం ఇవి టాల్‌స్టాయ్ ఆదర్శాలు. ఇవన్నీ గాంధీ ఆశ్రమంలో ఆచరణలు.

జాన్ రస్కిన్ (1819–1900) రచన 'అన్ టు దిస్ లాస్ట్'.. పారిశ్రామికీకరణ నేపథ్యంలో శ్రామిక వర్గ దుస్థితిపై చేసిన రచన. గాంధీ దక్షిణాఫ్రికాలో ఉండగా పొలాక్ అనే స్నేహితుడు రైలు స్టేషనులో ఆయనకు ఈ పుస్తకాన్ని ఇచ్చాడు. రైలులోనే దాన్ని చదివేశారు గాంధీ. ఒక్కసారిగా నా జీవితాన్ని మార్చివేసిన పుస్తకం అన్నారు. రక్తంతో కన్నీళ్లతో రాయబడ్డ పుస్తకం ఇది అన్నారు. గుజరాతీ భాషలోకి సర్వోదయ పేరుతో అనువదించారు. గాంధీ సర్వోదయ సిద్ధాంతానికి తల్లివేరు రస్కిన్ రచనే.

- డా.రెంటాల శ్రీవెంకటేశ్వర రావు


ఇటువంటి వ్యాసాలు చదువుతున్నప్పుడు గాంధీ తత్వం సర్వం ఇతరుల నుంచి గ్రహించబడినదే అనీ, ఆయన స్వయంగా రూపొందించినది ఏమీ లేదనీ అనిపించే అవకాశం ఉంది. కానీ అది నిజం కాదు. దేన్నయినా ఎవరు చెప్పినా సొంత వడపోతకు గురిచేసి కానీ మహాత్మాగాంధీ స్వీకరించరనేది ఆయన జీవితం నిరూపించే సత్యం.

కొన్ని రచనలు, కొందరు వ్యక్తులు మనకు కొత్త ఆలోచనా బీజాలను అందిస్తారు. కొందరు అప్పటికే బీజ ప్రాయంగా ఉన్న మన ఆలోచనలకు స్పష్టతను, బలాన్ని సమకూరుస్తారు. మరిచిపోకూడని విషయం ఏమిటంటే మనం కాని దానిని మనకు ఎవరూ చేర్చలేరు.

> **గీతను తన దైనందిన మార్గదర్శినిగా చేసుకున్నా.. గీతలో కృష్ణుడు అర్జునుడికి శస్త్రయుద్ధమే కర్తవ్యమని బోధిస్తే అహింసను నమ్ముకున్న గాంధీ దానితో విభేదించారు. గీతపై తనకున్న విధేయతే గీతను సవరించే అర్హత నిచ్చిందని నమ్మారు.**

> **స్థూలంగా చూస్తే గాంధీ అంతరాత్మలో భగవద్గీత, వ్యక్తిగత జీవితంలో టాల్‌స్టాయ్, రాయచంద్, ఆర్థిక దృష్టిలో రస్కిన్, రాజకీయ జీవితంలో థోరో కనిపిస్తారు.**

## డిఫరెంట్ క్లిక్స్



**ఇందిరా.. గాంధీ**
**గాంధీజీతో ఎవరనుకున్నారు.. దేశ ఉక్కు మహిళ ఇందిర..**



**ఎండ దెబ్బకు తలగడ వైద్యం.. 1940లో ఓ ఎండాకాలం రోజున వేడిని తాళలేక తలగడ నెత్తిన పెట్టుకుని వెళ్తున్న బాపూ**



**స్వచ్ఛ భారత్.. పితామహుడు.. శుభ్రత పరిశుభ్రత విషయంలో గాంధీజీ ముందుంటారు. దానికి నిదర్శనమే ఈ చిత్రం**



**బ్రిటీషర్లపై హెవీ వెయిట్**
**గాంధీజీ మామూలుగా అయితే లైట్ వెయిట్.. మరి బ్రిటిషర్లకు హెవీ వెయిటేగా.. బిర్లా హౌస్‌లో బరువు చూసుకుంటున్నప్పుడు తీసినదీ చిత్రం**

# బటర్‌ఫ్లై ఎఫెక్ట్

ఒక కుర్రవాడు బస్ దొరక్క ఇంటర్వ్యూకి ఆలస్యంగా వెళ్లాడు. ఉద్యోగం రాలేదు. నిస్త్రాణగా వెనక్కి వస్తున్నాడు. మే నెల. విపరీతమైన దాహం. కిలోమీటర్ నడిచినా ఒక్క నీళ్ల షాపు కూడా కనబడలేదు. అప్పుడు అతనికి ఒక ఆలోచన వచ్చి ఆ వీధిలోనే చిన్న షాప్ పెట్టి నీళ్ల బాటిల్స్ అమ్మసాగాడు. మూడు నెలల్లో ఐదు వేల లాభం వచ్చింది. దాంతో కూల్‌డ్రింక్స్, ఆపై ఐస్‌క్రీమ్... అలా పెంచుకుంటూ పోయి, ఆ తర్వాత దాన్ని సూపర్ మార్కెట్ చేశాడు. పదేళ్లలో లక్షాధికారి అయ్యాడు. ఆ రోజు అతడికి గానీ బస్సు దొరికి ఉంటే ఇప్పటికీ రూ.10 వేలకు ఉద్యోగం చేస్తూ ఉండేవాడు.

### ఒక చిన్న సంఘటన జీవితాన్ని మార్చటం అంటే అదే!

గాంధీ జీవితంలో కూడా ఇలాంటి 'బటర్‌ఫ్లై ఎఫెక్ట్' ఒకటి ఉంది. సౌత్–ఆఫ్రికా రైలు నుంచి ఒక బ్రిటిష్ వాడు ఆయన సామాన్లు బయటికి విసిరేసినప్పుడు 'మిమ్మల్ని కూడా భారతదేశం నుంచి ఇలాగే బయటకి విసిరేస్తా'అన్న ఆలోచన ఆయనకి బహుశా అప్పుడే వచ్చి ఉంటుంది.

**ఒక చిన్న సంఘటన మనిషి జీవితాన్ని మార్చటాన్ని 'బటర్ ఫ్లై ఎఫెక్ట్' అంటారు.**

మా ఎనిమిదో తరగతి ఇంగ్లీష్‌లో 'సెల్ఫ్ హెల్ప్'అన్న పాఠం ఉండేది. మహాత్మాగాంధీ ఆత్మకథ నుంచి ఒక భాగం. అందులో బాపూ, 'తన క్షవరం తనే చేసుకునేవాడు'అని వ్రాశారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మేము ఆ రోజుల్లో ప్రతి పైసా చూసుకోవలసి వచ్చేది. గాంధీగారి పాఠంతో ప్రభావితమైన నేను, మా తండ్రి గారి ప్రోత్సాహంతో నా క్షురకర్మ నేనే చేసుకోవటం ప్రారంభించాను. గత 60 సంవత్సరాల్లో ఆ రోజు నుంచి ఇప్పటివరకూ కేవలం పది, పదిహేను సార్లు తప్ప మళ్ళీ బార్బర్ షాప్‌కి వెళ్ళలేదు. ఒక చిన్ని వ్యాసం నా జీవితాన్ని అలా ప్రభావితం చేసింది.

ఒక మంచి ఉపన్యాసం కూడా మనిషి జీవితాన్ని మారుస్తుంది. ఈ తరం వాళ్లకి అంతగా పరిచయం లేని వ్యాపార దక్షులు, పత్రికా సంపాదకులు కె.ఎన్.కేసరి. మహాత్మా ఇచ్చిన ఉపన్యాసం తనపై ఎలాంటి ప్రభావం చూపించిందో కేసరి మాటల్లో:

**''..పుట్టిన ఐదో నెలలోనే తండ్రిని పోగొట్టుకొని, నా కోసం తల్లి పడుతున్న అవస్థలు చూడలేక చెన్నపట్నం వెళ్లాలనుకున్నాను. డబ్బు లేదు. ఒంగోలు నుంచి కాలి నడకన మద్రాసు చేరాను. అక్కడ అష్టకష్టాలు పడ్డాను. ఆ పై 'కేసరి సంస్థ' స్థాపించి, ఆయుర్వేద ఔషధాల ద్వారా స్త్రీల వ్యాధులకు 'లోధ్ర'మందు తయారు చేసి అనతికాలంలోనే విశేష ధనార్జన చేశాను. నడమంత్రపు సిరి తలకెక్కినది. అంతులేని కోరికలు. పటాటోపమైన వేషము. చెవులకు ఒంటి రాయి వజ్రము. మొలకు బంగారు మొలత్రాడు.**

ఆ రోజు 1919 ఏప్రిల్ నెలలో మన మహాత్ముడు విజయవాడలో ఇచ్చిన ఉపన్యాసం విన్నప్పటి నుంచి నాలో క్రమక్రమముగా అనేక మార్పులు కలిగాయి. తల బోడిచేసి గాంధి టోపీని ధరించితిని. వేషము మారినది. పట్టుచొక్కాలు, దుకూలాంబరములు దూరములయినవి. సాత్వికాహారము మితముగ భుజించుటకు అలవడితని. కోరికలకు కళ్లెం వేయడమూ, సేవా దృక్పథమూ, ఆధ్యాత్మిక దృక్కోణమూ నేర్చుకున్నాను'' అంటారు కేసరి. ఆపై ఆయన గొప్ప వితరణశీలిగా మారి, సర్వస్వం సమాజానికి అర్పించి ప్రజాసేవకి అంకితమయ్యారు.

గీత ఆధారంగా 'విజయానికి ఆరో మెట్టు'పుస్తకం రాస్తున్నప్పుడు, మహాత్ముడి ఆలోచనపై అత్యధిక ప్రభావం చూపిన గ్రంథం భగవద్గీత అని తెలిసింది. తన తల్లికి జైనులతో ఉన్న పరిచయాల వలన గాంధీకి జైన్ ఫిలాసఫీ కూడా ప్రియమైనదిగా మారింది. ''గీతా పఠనం వల్ల ఆత్మజ్ఞానము, నిష్కామకర్మ ఒకవైపూ, జైన మత ఆలోచనలైన కరుణ, శాకాహారం, ఉపవాసం, స్వీయ క్రమశిక్షణ, ప్రతిజ్ఞ యొక్క ప్రాముఖ్యత విలువల ప్రభావం మరోవైపూ నా జీవితంలో ప్రధానాంశాలయ్యాయి''అంటారు బాపూ. బౌద్ధాన్ని నమ్మే మాలాంటి వారికి జైన్ ఫిలాసఫీ విరుద్ధంగా కనపడుతుంది. అయితే గౌతమ బుద్ధుడే ఒక చోట, ''నీ మనసుకు సరి అయినది నమ్ము. సరి కాదనిపిస్తే, నేను చెప్పేది కూడా నమ్మే అవసరము లేదు''అంటాడు. ప్రజలందరూ జైనిజం ఆచరిస్తే ప్రపంచమంతా సుభిక్షంగా ఉంటుందని గాంధీ నమ్మారు.

ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీ గురించి 'రక్తమాంసాలున్న ఇటువంటి ఒక మనిషి నిజంగా మన మధ్య జీవించాడంటే రాబోయే తరాల వారు నమ్మలేరు' అంటాడు. బెర్నార్డ్ షా వంటి ఫేబియన్లతో పరిచయం ఏర్పడిన తరువాత, ఆయన వ్యక్తిత్వమూ, ఆలోచనాసరళీ మరింత నిర్దిష్టంగా రూపుదిద్దుకొన్నాయని కొందరు చరిత్రకారులు అంటారు. షా ప్రసక్తి వచ్చింది కాబట్టి అప్రస్తుతమైనా, నన్ను బాగా ప్రభావితం చేసిన ఒక కథ చెపుతాను.

బాల్‌రూమ్‌లో బెర్నార్డ్‌షా ఓ మూల కూర్చుని ఉండగా, ఒకామె వచ్చి 'డ్యాన్స్ చెయ్యకుండా ఇలా కూర్చున్నారేమిటి? రండి'అన్నదట.

'వద్దులెండి. నేను కథ గురించి ఆలోచించుకుంటున్నాను'అన్నాడు షా.

'డ్యాన్స్ చేస్తూ కూడా ఆలోచించుకోవచ్చుగా'అన్నది ఆమె.

'ఒకేసారి రెండు పనులు చేయటం నాకు రాదు'అన్నాడు షా.

'జీవితాన్ని ఎంజాయ్ చెయ్యాలి. డ్యాన్స్‌లో ఉండే కిక్ తెలిస్తే మీరు ఈ మాట అనరు'.

'డ్యాన్స్‌లో ఉండే కిక్ నాకు బాగా తెలుసు. అందుకే నేను దానికి దూరంగా ఉంటున్నాను. పుస్తకాలు వ్రాయటం వల్ల నాకు కిక్‌తో పాటూ డబ్బు, కీర్తి, సంతృప్తి వస్తాయి. ఈ కిక్ శాశ్వతమైనది, లోతైనది. డ్యాన్స్‌కి అలవాటు పడితే ఆ తాత్కాలికమైన కిక్‌లో నేను శాశ్వతమైన దాన్ని మర్చిపోతాను' అన్నాడట.

'మీరు చెప్పే ఒక్క మాట కూడా నాకు అర్థం కాలేదు'అని చెప్పి ఆమె వెళ్లిపోయిందట.

ఈ కాలపు విద్యార్థులకు ఈ కథ ఒక బట్టర్‌ఫ్లై ఎఫెక్ట్ కావాలి.



- యండమూరి వీరేంద్రనాథ్

### బాపూ గురించి చాలా మందికి తెలియని వివరాలు

- ఆహార పంటలు వదిలి, నీలిమందు వంటి వాణిజ్యపంటలు పండించమని బీహారు రైతులను తెల్లదొరలు నిర్బంధించినప్పుడు ఆ పరిస్థితులను వ్యతిరేకించి గాంధీ సత్యాగ్రహాలు నిర్వహించి అరెస్టు అయినపుడు జనంలో పెద్ద యెత్తున నిరసన పెల్లుబికింది. చివరకు బ్రిటిష్ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గింది. అప్పటి నుంచే గాంధీని ప్రజలు ప్రేమతో 'బాపూ'అనీ, 'మహాత్మా'అనీ పిలుచుకోసాగారు.
- దేశాన్ని మతప్రాతిపదికన విభజించటాన్ని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించాడు. జిన్నాను ప్రధానమంత్రిగా చేసి అయినా సరే దేశాన్ని ఐక్యంగా నిలపాలని ఆయన వాంఛ. కానీ, 'దేశ విభజనో, అంతర్గత యుద్ధమో తేల్చుకోండి'అని జిన్నా హెచ్చరించాడు. కలహాలు ఆపాలంటే విభజన కంటే గత్యంతరము లేదని హతాశుడైన గాంధీ ఒప్పుకొనక తప్పలేదు. పూర్తిగా కృంగిపోయాడు. 1947 ఆగస్టు 15న దేశమంతా సంబరాలు జరుపుకొంటూ ఉండగా కలకత్తాలో ఒక హరిజనవాడను శుభ్రం చేస్తూ గడిపాడు.
- విభజన ఒప్పందం ప్రకారం పాకిస్తాన్‌కు ఇవ్వవలసిన 55 కోట్ల రూపాయలను (ఆ డబ్బు భారతదేశంపై యుద్ధానికి వాడబడుతుందని) ఇవ్వడానికి భారత్ నిరాకరించింది. ఈ విషయమై గాంధీ తన చివరి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. చివరకు ప్రభుత్వం దిగివచ్చి పాకిస్తాన్‌కు డబ్బు ఇవ్వడానికి అంగీకరించింది. ఈ మొత్తం వ్యవహారంలో గాంధీ పాకిస్తాన్‌కూ, ముస్లిములకూ వత్తాసు పలుకుతున్నాడని తీవ్రవాదులు ఉడికిపోయారు. గాంధీని గాడ్సే చంపాడని జనాలకి తెలుసుగానీ, 1934లోనే ఆయనపై మూడు హత్యా ప్రయత్నాలు జరిగాయి.
- నోబెల్ బహుమతికి మహాత్మాగాంధీ ఐదుసార్లు ప్రతిపాదించబడ్డాడు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి అసంతృప్తి కలుగుతుందని ఇవ్వలేదు. 1948 లో మళ్లీ ప్రతిపాదించబడినా మరణానంతరం ఇవ్వకూడదనే నియమం వల్ల ఇవ్వలేదట. 20వ శతాబ్దిలో అత్యధిక మానవాళిని ప్రభావితం చేసిన నాయకునిగా కేబుల్ న్యూస్ నెట్‌వర్క్ (సీఎన్ఎన్) జరిపిన సర్వేలో ప్రజలు గాంధీజీని గుర్తించారు. నోబెల్ ప్రైజ్ కన్నా ప్రజాభిమానం ఎప్పుడూ గొప్పదే కదా.



'తల్లికి ఇచ్చిన మాటకు సాక్ష్యంగా తాను మాంసం ముట్టలేదని తెలిసిన మిత్రుల దగ్గర సర్టిఫికెట్లు తీసుకోవాలనుకున్నారు గాంధీ. కానీ మాంసం తింటున్నవాళ్లు కూడా తినడం లేదని సర్టిఫికెట్లు తీసుకోవడం చూసి, మాటకు విలువ ఉండాలే గానీ సర్టిఫికెట్లతో ఏం పని అనుకున్నారు.



'కారు బాడుగ, తపాలా, వార్తాపత్రికల నిమిత్తం పెట్టిన ఖర్చు, ఇలా ప్రతిపైసాకూ విద్యార్థి దశ నుంచే లెక్క రాసుకునేవారు గాంధీ. మితంగా ఖర్చు పెట్టడానికి ఈ ప్రణాళిక ఉపయోగపడింది. కారు అద్దెలు ఎక్కువ అవుతున్నాయని నడక అలవాటు చేసుకున్నారు.

'లాటిన్, ఫ్రెంచ్ రెండు భాషలు గాంధీకి తెలుసు. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు డచ్చిలా తెలుసుకోవడానికి లాటిన్ ఉపయోగపడింది.



# ఆయన కళగన్నారు



- కాళ్లకూరి శైలజ

మహాత్మాగాంధీ దేశం గర్వించదగ్గ నాయకుడు. అంతకు మించి ఆయన ఒక విశిష్ట విశ్వ మానవుడు. అటువంటి గాంధీజీ కళల గురించి ఎలా ప్రతిస్పందించే వారో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

'సంగీతం గొంతులోంచి వచ్చేది కాదు. సంగీతం అంటే మేధ, ఇంద్రియాలు, మనసు.. ఈ మూడింటి నుంచి వెలువడే ఒక గొప్ప విషయం' అనేది గాంధీ మాట.

1926 ఏప్రిల్ 15న అహ్మదాబాద్‌లో మాట్లాడుతూ– 'సంగీతం గురించి మనం మరింత విశాలంగా ఆలోచించాలి. అందలి లయ, శృతి, స్పందన ఈ మూడు లేకుండా జీవితంలో ఏ పనినీ చేయలేం. అలా ఆలోచిస్తే ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను సంగీతాభ్యాసం కోసం పంపిస్తారో వారు ఈ దేశ పురోగమనానికి దోహదపడే వ్యక్తులు కాగలరు'.

'కళ కళ కోసమే' అంటే గాంధీజీ ఏకీభవించలేదు. 'ఏ కళ మనిషిని సంస్కరించి విశాల దృక్పథం వైపు మరల్చగలదో అదే కళ అంటే' అని నిర్వచించారాయన.

మరొకసారి ఆయన ఇలా అన్నారు– 'ఎందుకో గానీ, మనం సంగీతం అంటే ఒక పాట పాడడం, ఒక వాయిద్యాన్ని తగు నైపుణ్యంతో వినిపించడం అనుకుంటున్నాం. కానీ, నిజానికి సంగీతం అంటే ఏక తాళం, ఏకతా రాగం. అది ఆ మనిషి హృదయ తంత్రులన్నీ కలిపి ఒకే ఒక అపురూప స్వరంగా గానం చెయ్యడమే'. ఎంత లోతైన భావన ఇది!

గాంధీ చాలా విషయాలను క్షుణ్ణంగా చర్చించారు. అలా ఆయన కళలను గురించి ఎలా నిర్వచించారో కూడ మనం తెలుసుకోవాలి. నిజానికి ఆయన దృక్కోణం మానవతా కోణం. ఆయన చెప్పిన మాటలు ఆ కాలపు ఎందరో కళాకారులను సైతం ఆశ్చర్యానికి గురి చేశాయి. 'నాకు ఎందుకో గాని, సంగీతమంటే చరఖా ఆడినప్పటి ధ్వనియే అనిపిస్తుంది. అలా స్వహస్తాలతో నేసిన ఖాదీ వస్త్రమే శృతి శుద్ధమైన సంగీతంగా అనిపిస్తుంది! యావత్ భారతావనిలోని కోట్ల మంది పౌరులు ఒకే పాట ఆలపించినపుడు, ఈ బంజరు భూముల నుంచి స్వేచ్ఛాగీతాలు ఉద్భవించినప్పుడు... అప్పుడే సంగీతం అనే ప్రయోగం సఫలమైనట్టుగా నేను భావిస్తాను'. ఎంతటి మహత్తరమైన ఆకాంక్ష కదా ఇది!

గాంధీ దక్షిణాఫ్రికా ఆశ్రమంలో తొలినాళ్లలోనే సాయం సమయపు ప్రార్థనను ఆశ్రమ దినచర్యలో భాగంగా చేశారు. సబర్మతిలో పండిట్ ఎన్.ఎం.ఖారే, వినోబాభావే, బల్కోవాభావే, మామా ఫడ్కే వంటి ప్రముఖ సంగీతకారులు ఆస్థాన కళాకారులుగా ఉండేవారు. ప్రతి కాంగ్రెస్ సమావేశంలోనూ పాటల ఆలాపన, వాద్యసంగీతం అంతర్భాగంగా ఉండేవి.

గాంధీని ఒకరు, 'మీ జీవితంలో సంగీతం పాత్ర ఏమిటి?' అని అడిగారు. దానికి ఆయన నవ్వుతూ, 'నా చుట్టూ ఉన్న సంక్షోభం, ఒత్తిడితో నేనెప్పుడో ఎండుటాకులా కొట్టుకుపోయేవాడిని. సంగీతమనే ఒక విశిష్టమైన శక్తి నాకు తోడుగా ఉంది కాబట్టి ఇలా ఉన్నాను!' అని సమాధానం ఇచ్చారు.

ఆయన 'నితివం కవ్యో' పేరిట కొన్ని భజనలు, 'రామధున్'అనే ప్రార్థనాగీతం సేవాగ్రాంలో ఎప్పుడూ పాడిస్తూ ఉండేవారు. 'వైష్ణవ జనతో తేనే కహియతి' అనే పాటను ఎంఎస్ సుబ్బులక్ష్మి గళంలో రికార్డు చేసి పంపాలని ఆయన స్వయంగా ఉత్తరం రాసి పంపారు. హిందుస్తానీ సంగీతంలో తనకు అంతగా ప్రవేశం లేదు గనుక ఈ భజన ఎలా పాడగలనో? అని సుబ్బులక్ష్మి సందేహం వెలిబుచ్చారు. 'మీ ఆర్ద్రత నిండిన గళంలో దానిని వచనంగా మాట్లాడినా నేను స్వీకరిస్తాను' అని ఆయన చెప్పారు. ఆ పాట ఎంత సౌహార్ద్రగీతం అయిందో. అంతకుమించి ప్రాచుర్యం పొందింది.

'సత్యం–అహింస' అనే రెండు రాగాలు, 'స్వదేశీ ఖాదీ' అనే రెండు వాయిద్యాలు, 'నిస్వార్థం బ్రహ్మచర్యం' అనే రెండు స్వరా లు, 'హింస–చౌర్యం'అనే రెండు నిషిద్ధ స్వరాలతో.. చరఖా తిప్పేటప్పుడు వచ్చేటి శబ్దమే సంగీతంగా మహాత్ముని స్వేచ్ఛాగీతం నిరంతరం సాగేది' అని గాంధీజీ గురించి డాక్టర్ నమ్రతా మిశ్రా చెప్పిన మాటలు విలువైనవి.

నందలాల్ బోస్ అనే శాంతి నికేతన్ కళాకారునితో గాంధీకి మంచి సంబంధాలు ఉండేవి. 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో బోస్ భారతదేశ గ్రామీణ కళారూపాలను ప్రదర్శనగా అమర్చారు. దొరికే గడ్డి, మన్ను, కొబ్బరిపీచు, వెదురు, టెర్రకోట వంటి ముడి పదార్థాలతో తయారు చేసిన ఈ కళారూపాలు గాంధీ మనసు దోచుకున్నాయి. 'ఈ కళారూపాలు నాటకం, సినిమా వలే చలన చిత్రాలు కావు. కానీ ఇదే, మన దేశ మౌలిక కళా స్వరూపం' అని గాంధీ ప్రశంసించారు.

కె.వెంకటప్ప అనే శాంతినికేతన్ విద్యార్థి గీసిన వర్ణచిత్రాలు చూసి గాంధీజీ చాలా సంబరపడ్డారు. 'మీకు నా ఆశీస్సులు. కానీ, చరఖా ఏవిధంగానైనా మిమ్ములను ప్రభావితపరచగలదా? ఒక సగటు గ్రామస్తుని జీవితాన్ని చరఖా ఎంతగా అర్థవంతం చేస్తుందో... మీరేమైనా తెలుసుకోగలిగితే దాన్నీ ఒక చిత్రంగా మీరు చేయగలరేమో ప్రయత్నించండి' అని అభ్యర్థించారు.

1930లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు వెళ్లిన గాంధీ లండన్లో అమెరికన్ శిల్పి ఎ.పీ జు డేవిడ్ తయారుచేసిన శిల్పాల సందర్శనకు వెళ్లినపుడు, అక్కడి కొందరు చిత్రకారులు గాంధీ రేఖాచిత్రాన్నే వేయడానికి వచ్చి, 'క్షణక్షణం మారిపోయే ఒక మానవ రూపమే గాంధీ' అన్నారట.

స్వాతంత్ర్యం రాక మునుపే 'జాతీయ గ్రామీణ పరిశ్రమ సమాఖ్య'ను ఏర్పాటు చేయాలని గాంధీ కలలు కన్నారు. మహాత్మా గాంధీ దృష్టిలో సత్యం, శ్రమ, సౌందర్యం ఒకదానితో ఒకటి పెనవేసుకున్నవి. రసాత్మకత లేని పని వ్యర్థమనీ, ఎవరికి వారు కళా సౌందర్యం, నైపుణ్యం తమ దైనందిన కార్యాలన్నిటిలో అవలంబించాలని, ఆయన కోరుకునే వారు.

'ఒక వ్యక్తి సంతోషం అంటే కేవలం వారి బహిరంతరాలలో కానవచ్చే ఉల్లాసం. అలాంటి లక్షల హృదయాల ఆనంద క్షణాలను వ్యక్తీకరించేదే కళ' అంటారాయన. సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని కళను నిర్వచించిన మహనీయుడు గాంధీజీ.



ప్రపంచ ప్రఖ్యాత స్త్రీవాద ఉద్యమ నాయకురాలు మార్గరెట్ సెంజెర్ 1936లో గాంధీజీని ఇంటర్వ్యూ చేశారు. అందులో ఆమె ఒక తమాషా మాట రాశారు. 'గాంధీ ముఖంలో ఒక కాంతి ఉంది. ఒక మార్మికత ఉంది. దానిని స్త్రీలు బాగా గుర్తించారు. గుర్తించడంలో పురుషులు విఫలమయ్యారు'.

## ఊతకర్రలు

### బుల్లెట్ తాకే వరకు తోడు నిలిచారు

గాంధీజీ తన జీవన యానాన్ని కేవలం ఒక 'పురుషుడి ప్రయాణం'గా ఎప్పుడూ భావించలేదు. ఒక సహ మానవుని ప్రయాణంగా భావించారు. ఆ ప్రయాణంలో స్త్రీలకు ఎప్పుడూ చోటిచ్చారు. అప్పటి భావజాలంతో చూస్తే, ఆనాటి ఇతర నాయకుల భావజాలంతో పోల్చితే గాంధీజీ స్త్రీల విషయంలో ఎంతో ఆధునికునిగా కనిపిస్తారు.

### కస్తూర్బా



గాంధీజీ తన భార్య కస్తూర్బాను ధార్మిక సహజీవనిగా గౌరవించారు. అందువల్లే కస్తూర్బా గాంధీజీ జీవితంలోని అన్ని ఆటుపోట్లలో అండగా నిలిచారు. ఉద్యమంలో ఆయనతో కలసి జైలుకు వెళ్లారు. నిజానికి వారి సాంసారిక జీవితంలోని ఒక యాదృచ్ఛిక ఘటన గాంధీజీ మనసులో బ్రహ్మచర్యం అలజడిని రేపిందని అనిపిస్తుంది. ఆ రోజు గాంధీజీ తండ్రి కరమ్‌చంద్ తుది ఘడియలు లెక్కిస్తున్నారు. అర్ధరాత్రి. అంతా మెలకువతో ఉన్నారు. ఒక బంధువు గాంధీజీ దగ్గరకు వచ్చి నీవు కొద్దిసేపు పడుకో అని పంపించేశారు. ఆ సమయంలో ఆయన కస్తూర్బా గదిలోకి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తరువాత ఎవరో తలుపు తట్టి తండ్రి మరణవార్త చెప్పారు. ఆ క్షణంలో గాంధీజీ ఆత్మచింతనకు లోనయ్యారు. ఆ బంధువు వెళ్లి పడుకోమని చెప్పినంత మాత్రానే తాను భార్య ఉన్న గదిలోకి వెళ్లడానికి కారణం దేహవాంఛేనని గాంధీజీ నిశ్చితాభిప్రాయానికి వచ్చేశారు. దీంతో 1901 నుంచి బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరణలో పెట్టారు. కస్తూర్బా ఆయన నిర్ణయాన్ని గౌరవించకపోతే ఇది జరిగేది కాదు. అందుకనే గాంధీజీ ఆమెలో చాలాసార్లు తల్లిని చూసుకునేవారు. గాంధీజీ జీవితంలో కష్ట సమయం 1944లో కస్తూర్బా కన్నుమూసిన తరువాతే ఆరంభమైంది. కస్తూర్బా లేని శూన్యత గాంధీ చివరి రోజుల్లో కనిపించింది.

### పాశ్చాత్య వనితలు




సాంజా షెల్సిన్

గాంధీ దక్షిణాఫ్రికాలో ఉండగా మహిళలు భక్తితో, గౌరవంతో, దైవికమైన ఆకర్షణతో ఆయనకు సన్నిహితులయ్యారు. వారిలో తొలిస్థానం మిల్లీ గ్రాహమ్ పోలాక్ అనే పాశ్చాత్య వనితదే. ఆమె దక్షిణాఫ్రికాలోనే ఉండేది. భర్త గాంధీజీ మిత్రుడే. అక్కడే పరిచయమైన మరో మహిళ సాంజా షెల్సిన్. ఆమె గాంధీజీ కార్యదర్శి. అంత మంచి కార్యదర్శి మళ్లీ లభించలేదని గాంధీ అభిప్రాయం. ఆయన జీవితంలోకి ఇలా వచ్చి అలా నిష్క్రమించిన వారి లో నిల్లీ క్రేమ్ కుక్ (అమెరికా) ఒకరు. ఇంకా మార్గరెట్ స్పీజెల్ (జర్మనీ), ఎస్తేర్ ఫేరింగ్.. గాంధీని దగ్గరి నుంచి చూసిన మహిళలు.

## వీరు కూడా..

గాంధీజీతో సాన్నిహిత్యం కలిగిన ఆశ్రమ వాసులలో లీలావతి అసార్ ఒకరు. ఈమెను గాంధీజీ 'నత్తగుల్ల' అని ముద్దుగా పిలిచేవారు. కంచన్ షా అనే మహిళ బ్రహ్మచర్యం పాటించడంలో గాంధీగారి మెప్పు పొందింది. 1920లో గాంధీజీకి 'ఊతకర్రలు' వచ్చాయి. అవి కొయ్యలు కాదు, మనుషులే. పేర్లు సుశీలా నయ్యర్, మనుబెన్, అభా బెన్. సుశీల గాంధీగారి వ్యక్తిగత వైద్యురాలు. మను, అభా ఆయన మనుమరాళ్లు. వీరిలో ఎవరు అందుబాటులో ఉంటే వారు గాంధీజీ నడవడానికి ఆసరా కల్పించేవారు. అందుకే వారిని ఊతకర్రలు అని పిలుస్తుండే వారాయన. అభా బెన్ గాంధీజీ మునిమనుమడు కను గాంధీ భార్య. కను గాంధీ గాంధీజీ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌గా పని చేశారు. గాడ్సే గాంధీజీని కాల్చినప్పుడు మనుతో పాటు మరొక పక్కనవున్న యువతి అభాయే. ప్రేమా బెన్ కంతక్, ప్రభావతి, రాజకుమారి అమృత్‌కౌర్‌లను కూడా గాంధీజీ ఎంతో ఆదరంతో చూసేవారు. గాంధీ సేనకు ప్రేమా బెన్‌ను మార్షల్ అని అంటుండే వారు. ఈమె తరచు గాంధీజీతో బ్రహ్మచర్యం గురించి చర్చించేది. ఇక ప్రభావతి ఉదంతం మరీ ప్రత్యేకమైనది. ఆమె జయప్రకాశ్ నారాయణ్ (లోక్‌నాయక్) భార్య. పెళ్లయ్యాక ఆశ్రమానికి వచ్చారు. గాంధీజీ ఆశయం మేరకు బ్రహ్మచర్య వ్రతం అవలంబించారు. అమృత్‌కౌర్ గాంధీజీని గురువుగా భావించేవారు. సరళాదేవి బహుముఖ ప్రజ్ఞాశాలి. బహుభాషా కోవిదురాలు. దేశంలో తొలి మహిళా సంఘం 'భారత్ స్త్రీ మండల్' వ్యవస్థాపకురాలు. రవీంద్రనాథ్ టాగూర్ మేనకోడలు.



సుశీలా నయ్యర్



ప్రభావతి

ఇక, మీరా బెన్.. సృజనాత్మకత, భావుకతతో తపించిపోయే కళాత్మక హృదయం కలిగిన అద్భుత మహిళ. ఆమె పేరు మేడ్లీన్ స్లేడ్. గాంధి ఆమెకు 'మీరా బెన్' (సోదరి మీరా) అని పేరు పెట్టారు. స్వతంత్ర భారతదేశంలో ఆమె సంఘ సేవకురాలిగా జీవితం గడిపారు. సుశీలా నయ్యర్ గాంధీ వ్యక్తిగత వైద్యురాలు. ఆ యన ఆంతరంగి కుల్లో ఒకరు. మనుబెన్.. అసలు పేరు మృదులా గాంధీ. గాంధీజీ సోదరుడి మనుమరాలు. 1948లో ఢిల్లీలో గాంధీజీని హత్య చేయడానికి నాథూరామ్ గాడ్సే రివాల్వర్ ఎత్తి, ఆ బుల్లెట్ తగలకుండా పక్కనే ఉన్న ఒక యువతిని పక్కకు నెట్టేశాడు. అలా నెట్టబడిన యువతి మను బెన్.



## వియోగ విషాదం

జీవిత సహచరి కస్తూర్బా గాంధీ పార్థీవదేహం ముందు నిశ్చల యోగిలా గాంధీ..

# కొల్లాయిగట్టితేనేమి మా గాంధీ...

తెలుగు సాహిత్యకారుల్లో గాంధీ అధికులకు ప్రియమైన వ్యక్తి. కొందరికి జాతిపిత. కొందరికి భగవంతుడి అపరావతారం. కొందరికి నాయకుడు. కొందరికి ఈనాటికీ అనుసరించవలసిన మార్గదర్శకుడు. ఇటీవల కొందరికి ప్రశ్నించవలసిన, కొండొకచో తిట్టవలసిన సామాన్యుడు. స్థూలదృష్టితో తెలుగు సాహిత్యంలో గాంధీ చిత్రణను చూస్తే మొట్టమొదట గుర్తుకొచ్చేది 'కొల్లాయిగట్టితేనేమి మా గాంధీ కోమటైతేనేమి' అన్న బసవరావు అప్పారావు గీతమే. ఈ గేయంలో గాంధీని వర్ణించిన తీరు కమనీయంగా, గాంధీని కళ్లెదుట చూస్తున్నట్లుగా ఉంటుంది.

'వెన్నపూసా మనసు కన్నతల్లీ ప్రేమ పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు
చక చక నడిస్తేను జగతి కంపించేను పలుకు పలికితేను బ్రహ్మ వాక్కేను'

అంటూ అప్పారావు గారు ఈ ఒక్క గీతంలోనే కాదు. ఎన్నో గీతాల్లో గాంధీని ప్రస్తుతించారు. గాంధీ వల్లే హిందూ, ముస్లిం ఐక్యత సాధ్యమైందని అంటూ చెరుకువాడ వెంకటరామయ్య–

'మన పాలి భాగ్యమేమందు
హిందూ మహమ్మదీయుల పొందు ఘనతర ధైర్యము
గల్గించు నాథుడు గాంధి మహాత్ముడు కై దండయైనాడు' అన్నారు.

అప్పట్లో దామరాజు పుండరీకాక్షుడు రాసిన 'శ్రీగాంధీనామము మరువాం మరువాం' అన్న గీతం అందరి నోటా తరచూ వినిపించేది.

కనుపర్తి వరలక్ష్మమ్మ, బసవరాజు అప్పారావు, తుమ్మల సీతారామమూర్తి, జాషువా మొదలైన వారెందరో గాంధీని, సమాజంపై గాంధీ ప్రభావాన్ని నేరుగా ప్రస్తుతించారు.

తుమ్మల సీతారామమూర్తి చౌదరిని 'మహాత్ముని ఆస్థానకవి'గా చేసినవి ఆయన రాసిన 'ఆత్మకథ' (గాంధీ స్వీయచరిత్రకు అనువాదం), 'మహాత్మకథ', 'ధర్మజ్యోతి', 'ఆత్మార్పణ', 'గాంధీగానం' వంటి కావ్యాలు. మహాత్మకథలో ఆయనంటారు–

'గాంధీయుగమున బుట్టితి గాంధి నడుపు నుద్యమంబుల
నలిగితినోపినంతగాంధి వీక్షించితిని
గాంధీ కవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు'.

గాంధీమీద శతకాలు మొదలుకుని స్మృతికావ్యాలు, చివరికి మంగళహారతులు కూడా వచ్చాయి.

'జయగాంధీ దేవా మంగళం జయమంగళం నీకు, సత్యాగ్రహాశ్రమ తాపసా శాంత స్వభావ మానసా'' వంటివి వింటే గాంధీ సహస్రనామ స్తోత్రం విష్ణు సహస్రనామంలా కూడా ఉందని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. గాంధీపై కావ్యాలు, గేయాలతోపాటు హరికథలు, శతకాలు, దండకాలు కూడా వచ్చాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి రేడియో కోసం రాసిన గాంధీ పాటలోని కమ్మదనం ఈనాటికీ తాజాగానే ఉంటుంది.

'కమ్మగా బతికితే గాంధీయుగం– మనిషి
కడుపునిండా తింటె గాంధీ జగం..
తన కంఠమున దాచి హాలాహలం
తలనుంచి కురిపించి గంగాజలం
మనిషి శివుడవడమే గాంధీ వరం
బాపుననుసరిస్తే చాలు మనమందరం' అంటారు కృష్ణశాస్త్రి.

సంప్రదాయకవులుగా భావించే పుట్టపర్తి నుంచి అభ్యుదయ కవులైన ఆరుద్ర, దాశరథుల వరకూ ఎందరో కవులు గాంధీకి తమ కవిత్వంలో చోటిచ్చారు. 'కొత్తవిజయాలు' అనే గేయంలో ఆరుద్ర–

'బుద్ధదేవుని కాలమందున పుట్టలేదని బాధపొందను
గాంధి మెట్టిన ఈయుగమ్మే ఘనతరంబని యెంచెదన్' అని అంటే,

'అహింసతో హృదయాలను
అవలీలగా జయించిన
మహాత్ముడే దేశానికి
మహనీయ దయాజ్యోతి' అన్నారు దాశరథి. చివరకు, 'గాంధీలాలీ మోహన గాంధీలాలీ కరుణాసాంద్రా మోహనదాసాగాంధీలాలీ' అంటూ జోలపాట కూడ వచ్చిందంటే గాంధీని తెలుగు వారు తమ సాహిత్యంతో ఎంతగా అక్కున చేర్చుకున్నారో అర్థమవుతుంది. 'కలియుగ ప్రహ్లాద చరిత్ర'లో దామరాజు పుండరీకాక్షుడు గాంధీని విష్ణుభక్త పరమాణువుగా భావించారు. పద్యం, వచనం, గేయం మూడు ప్రక్రియల్లోనూ గాంధీని కవిత్వీకరించారు కవులు. ఇక కల్పనా సాహిత్యానికి వస్తే కనుపర్తి వరలక్ష్మమ్మ దగ్గర్నుంచి తల్లావఝుల పతంజలి శాస్త్రి వరకూ గాంధీ ప్రస్తావనతో కథలు రాశారు. కథలు, నవలల్లో గాంధీ ఒక పాత్రగా అక్కడక్కడా కనిపించినా, గాంధీ నడిపించిన పోరాట ఘట్టాల చిత్రణే ఎక్కువగా కనిపిస్తుంది. నవలల్లో జాతీయోద్యమాన్ని ప్రస్తావించిన తొలి నవల వేలూరి శివరామశాస్త్రిగారి 'ఓబయ్య'(1920) పూర్తిగా గాంధీ స్ఫూర్తితో వచ్చిందే. ఆ తర్వాత అడవి బాపిరాజు నుంచి మహీధర రామమోహనరావు వరకూ ఎందరో నవలాకారులు గాంధీ స్ఫూర్తిగా కథానాయకుల జీవితాలను చిత్రించారు.


1921లో వచ్చిన 'మాలపల్లి'లో ప్రత్యేకంగా గాంధీని ఎక్కువసార్లు ప్రస్తావించకపోయినా గాంధీ సిద్ధాంతాల వ్యాప్తే ప్రధానాంశంగా రామదాసును దానికి ప్రతినిధిగా చూపించారు. అడవి బాపిరాజు నవలలు 'నారాయణరావు', 'కోనంగి' లో కథానాయకులిద్దరూ గాంధీ పిలుపు నందుకుని చదువులు, ఉద్యోగాలు వదిలేసుకున్నవారు. విశ్వనాథ 'వేయిపడగలు'లో నాయకుడు ధర్మారావు జాతీయోద్యమంలో పాల్గొనకపోయినా, కేశవరావు, రాఘవరావు గాంధీ భక్తులుగా కనిపిస్తారు. గాంధీని కృష్ణుడితో, రాట్నాన్ని వేణువుతో, దేశప్రజలను గోపికలతో పోలుస్తూ విశ్వనాథ.. గాంధీ అప్పటి సమాజంపై ఎంతటి ప్రభావం చూపాడో వర్ణిస్తారు. ధర్మారావు మాత్రం హరిజనోద్యమాన్ని, సహాయ నిరాకరణోద్యమాన్ని వ్యతిరేకించడం, అతనికి గాంధీపై తక్కినవాళ్లకున్నంత గౌరవం లేదని తెలుపుతుంది.

అడవి బాపిరాజు సంగతి వేరు. ఆయన స్వయంగా గాంధీ అభిమాని కనక ఆయన నవలానాయకుడు నారాయణరావు అలాగే కనిపిస్తాడు. కోనంగి నవలలో గాంధీకే పరిమితం కాకుండా, కమ్యూనిస్టుల భావజాలం గురించి కూడా రాసి, గాంధీ ఆలోచనలకూ, వారి ఆలోచనలకూ ఉన్న తేడాను చెప్పడం ద్వారా బాపిరాజు గాంధీని సవిమర్శకంగా చూసే ప్రయత్నం చేశారు. 'చివరకు మిగిలేది' జాతీయోద్యమానికి సంబంధించిన నవల కాకపోయినా, దయానిధి పెళ్లిరోజు రాత్రి ఇల్లు వదిలి వెళ్లడంతో అతని జీవితంలో వచ్చిన మలుపు గొప్పది; అలా వెళ్లిపోవడానికి కారణం 'ఒక సన్నటి, నల్లటి పొడుగాయన కర్ర పుచ్చుకుని తొందరగా కదిలిపోతున్నాడు. అందరూ ఆయన వెనకాల పడ్డారు. ఆయన పాదాల కింద ఇసుక రేణువులై ఈ ప్రజ, ఒక్కసారి లేచి గంతులేసి నలుదిక్కులా వ్యాపించింది' అని గాంధీని గొప్పగా వర్ణించాడు బుచ్చిబాబు.



- మృణాళిని
వ్యాసకర్త రచయిత్రి, విశ్రాంత అధ్యాపకురాలు

పద్మవిద్యాధురంధరుడైన గుర్రం జాషువా 'బాపూజీ' అనే ఖండ కావ్యంలో ఎంతో ఆర్తితో బాపూ హత్యపై యావత్ప్రపంచం చెందిన దిగ్భ్రాంతిని మన కళ్లకు కట్టారు. 'కలమున్ కైతలు మూగవోయినవి, శోకధ్వాంతముప్పొంగి కన్నులువోయెన్ సకల ప్రపంచమునకున్, దోడ్తో భయభ్రాంతమై బలహీనంబయి తూలె భారతము, విశ్వవ్యాపి బాపూజి, గుండెలలోనుండి పవిత్ర రక్తము చితాగ్నిన్ గ్రాగి ఘోషింపగన్'






'చిన్నతనంలో గాంధీజీకి బిడియం ఎక్కువ. బడి వదలగానే నేరుగా ఎటూ చూడకుండా ఇంటికి వచ్చేవాడు. ఎవరన్నా ఎగతాళి చేస్తారేమో అని భయపడేవాడు.



'గాంధీజీకి బాగా ఇష్టమైన భజన 'వైష్ణవ జన తో' రాసిన కవి నరసింహ్ మెహతా. 15వ శతాబ్దంలో ఆయన గుజరాతీలో రాశాడు. గాంధీజీ జయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ 124 దేశాల్లోని గాయనీగాయకులతో ఆ పాట పాడించి ఒక వీడియోను విడుదల చేసింది.


గాంధీజీ తన ఆత్మకథ 'ఆటో బయోగ్రఫీ: మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్' ను ఆయన ఆత్మకథను ముందు గుజరాతీలో రాసిన ఈ పుస్తకాన్ని ఆయన కార్యదర్శి మహదేవ్ దేశాయ్ ఆంగ్లంలోకి అనువదించారు.





'పారిస్‌లోని ఐఫిల్ టవర్‌ను గాంధీజీ సందర్శించారు. కానీ ఆయనకు నచ్చలేదు. అందులో శిల్పం లేదనీ, కేవలం సంతలో ప్రదర్శన కోసం పెట్టబడిన బొమ్మ అనీ అన్నారు.

# 'నాలుక'ను జయించి



మహాత్మాగాంధీ ఆహారం గురించి కూడా చాలా రకాలు పరిశోధనలు చేశారు. మనం తినే ఆహారం ఎక్కడి నుంచి వస్తున్నది? దాన్ని ఎట్లా ప్రాసెస్ చేస్తున్నారు? ఎంత తింటున్నారు? ఎలా తింటున్నారు? అనే అంశాలపై దృష్టిపెట్టారు. ఉదాహరణకు బెల్లం మంచిదా, పంచదార మంచిదా అని ఆలోచించినప్పుడు ఆయనకు ఏమనిపించిందంటే.. బెల్లం తయారీ గ్రామస్తుల చేతుల్లో ఉంటుంది. పంచదార పూర్తిగా పారిశ్రామికవేత్తల చేతుల్లోకి వెళ్లిపోతుంది. అప్పుడు గ్రామస్తులకు వాళ్ల ఆదాయం మీద, వాళ్ల పంట మీద నియంత్రణ లేకుండా పోతుంది. బెల్లం తినటం వల్ల పౌష్టికాంశాలు అందుతాయి. పంచదారతో అలాంటి అవకాశం లేదు. పైగా మళ్లీ మళ్లీ తినాలని అని పించేలా చేసే లక్షణం పంచదారకు ఉంది. కాబట్టి, పంచదార కన్నా బెల్లం తినటమే మంచిది. కావాలంటే పోషకాహార నిపుణులను అడిగి నిర్ధారించుకోండని తన ప్రసంగాల్లో, వ్యాసాల్లో గాంధీజీ చెబుతూ వచ్చారు. అట్లాగే నెయ్యికి, వనస్పతికి మధ్య జరిగిన చర్చలో ఆయన స్పష్టంగా చెప్పింది ఏమిటంటే మనిషి ఒక జంతువును ఎప్పటికీ తన అవసరాల కోసమే పీడించడం మంచి పద్ధతి కాదు. కాబట్టి, పశువు పాలను, ఆ పాల నుంచి తీసే నెయ్యి వాడకాన్ని తగ్గించుకోవాలన్నాడు. ఇక నెయ్యినే వద్దంటే దానిలా కనబడేలా తయారు చేసినది కాబట్టి వనస్పతి కూడా వద్దన్నాడు. వనస్పతి అనేది ప్రకృతిలో లేదు. ఇది తీసుకోవడం ఏ రకంగా కూడా మంచిది కాదని వ్యతిరేకించాడు.

ఇక పాలపై ఆయనకు మొదటి నుంచీ వ్యతిరేకమే. జంతువు నుంచి తీసిన ఉత్పత్తి కాబట్టి వద్దన్నాడు. ప్రకృతి వైద్యాన్ని పాటించినప్పుడు ఆవు పాలు తీసుకోవడం సరికాదని మానుకున్నాడు. అయితే, ఆయనకు అనారోగ్యంతో బరువు తగ్గిపోయినప్పుడు వైద్యులు జంతువుల ప్రొటీన్లు తీసుకోవాలన్నారు. తాను వద్దనుకున్నది ఆవు పాలు కాబట్టి, మేక పాల గురించి లోతుగా ఆలోచించారు. రుచికి ప్రాధాన్యం ఇవ్వలేదన్నమాట. పైగా, మారుమూల గ్రామీణులకు కూడా అందుబాటులో ఉంటుందన్న దృష్టితో కూడా మేక పాలను డాక్టర్ల సూచన మేరకు తీసుకున్నాడు. టీ, కాఫీలు ఏవీ అవసరం లేదు. వాటిని అలవాటు చేసుకుంటే వాటి చుట్టూ ఇంకా కొన్ని కోరి కలు పుట్టుకొస్తాయి కాబట్టి వద్దన్నాడు. కాసేపటికి ఏదో ఒకటి నములుతూ ఉండే పట్టణవాసుల అలవాటును కూడా ఆయన నిరసించాడు. తిండి విషయానికొచ్చే సరికి కాస్త తక్కువ తినడమే మంచిది అని మహాత్మా గాంధీ సూత్రీకరించాడు. నాగరికత పెరుగుతున్నకొద్దీ ఎప్పుడూ ఆహారాన్ని అందుబాటులో ఉంచుకునే వ్యవస్థను తయారు చేసుకున్నాం. ఇక ఎప్పుడూ ఆహారం ఎదురుగా ఉంటుంది కాబట్టి అవసరాలకు మించే తింటున్నామన్నది గాంధీ గారు గమనించారు. అందుకని నాలుకను మనం జయించాలి అని ఆయన సూత్రీకరించాడు. ప్రకృతిలో జీవులన్నీ అవసరం కోసమే తింటాయి. మనిషి మాత్రమే నాలుక కోసం తింటున్నాడు. మనం తింటున్నది బతకడం కోసం మాత్రమే. తినటం కోసం బతకొద్దు అని చెప్పాడు. కాబట్టి, నాలుకను మనం జయించాలి.

పాలిష్ బియ్యాన్ని కూడా ఆయన వ్యతిరేకించాడు. మన ధాన్యాన్ని మనం దంచుకొని తినటం మంచిదని ఆయన అభిప్రాయం. దంపుడు బియ్యం తయారు చేసుకోవడం అనేది గ్రామీణుల వ్యాపకం. ఈ వ్యాపకం మిల్లర్ల చెప్పుచేతల్లోకి పోతుందని, తెల్లబియ్యాన్ని ఎరగా చూపి మిల్లర్లు మనల్ని ఆకర్షిస్తారని ఆయన తెలిపారు. ఆ విధంగా పూర్తిగా నిర్జీవమైన తెల్ల బియ్యానికి అలవాటుపడుతున్నామని 1940వ దశకంలోనే హెచ్చరించాడు. దంపుడు బియ్యమే తినాలని సూచించాడు. అట్లాగే, వీలైనన్ని పండ్లు, పచ్చి ఆకుకూరలు తినమని గాంధీజీ చెప్పాడు. అంటే, ఉడికించని ఆహారం ఆరోగ్యదాయకమని ఆయన చెప్పాడు. వండటం, పాత్రలు శుభ్రం చేసుకోవటంలో మహిళల చాకిరీని తగ్గించడానికి కూడా ఇది ఉపయోగపడుతుందని భావించాడు. ఇంటి పనుల్లో పురుషులు కూడా మహిళలకు తోడ్పడాలని సూచించాడు. రోజుకు ఒకటి లేదా రెండు నిమ్మకాయలు తీసుకోమన్నాడు. శరీరంలో కలుషితాల క్లీనింగ్‌కు విటమిన్ సిని ఇవ్వటం ద్వారా ఉపయోగపడుతుందని చెప్పాడు. నిమ్మకాయ దొరకని సందర్భాల్లో చింతపండు వాడుకోమని చెప్పాడు.

### శాకా 'హారం'

ప్రొటీన్ కోసం మాంసం తింటున్న వాళ్లు పప్పులు తినకుండా ఉండొచ్చు కదా అనేవాడు. అందరికీ కావాల్సినటువంటి ప్రాథమిక ఆహారం అందుబాటులో ఉండాలంటే దాని అవసరం లేని వారు త్యాగం చేయాలి కదా అనేవాడు. ఆయన దేని గురించి ఆలోచించినా గ్రామాల్లో ప్రజలందరికీ ఇది అందుబాటులో ఉంటుందా లేదా అని ఆలోచించేవాడు.

ఆయన రోజూ ఉదయపు అల్పాహారంలో 10–12 వేరుశనగ గింజలు తినేవాడు. ఒక రోజు ప్లేటులో అంతకన్నా నాలుగు గింజలు ఎక్కువ పెడితే.. వద్దు అని గాంధీ గారు తిరస్కరించారు. 'నేను ఎక్కువ తింటున్నాను అంటే ఇంకెవరికో తక్కువ అవుతుంద'ని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌తో అన్నాడు. ఆహారానికి సంబంధించిన ఎన్నో ప్రయోగాలు చేశాడు. 'డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్'పుస్తకంలో ఇటువంటి అనేక విషయాలు రాశారాయన.

ఈ ఆహార నియమాలు ఎవరికి వాళ్లు ఆచరించి చూసిన తర్వాతే ఇతరులకు చెప్పండి అని చెబుతాడన్నమాట ఆయన. ఇవి చేయడం పెద్ద కష్టం కాదు. సులువు. మన చేతుల్లో ఉన్నది. ఎటొచ్చీ ఏమిటంటే వీటన్నిటినీ పాటించడానికి తగినంతటి మానసిక శక్తి ఉందా? అన్నది ప్రశ్న. అసలు ఆ ముడి సరుకే కష్టమవుతున్నది. మన పరిస్థితుల్లో ఎంత మార్పొచ్చిందంటే.. వేటి పట్లా మనకు కంట్రోల్ లేదనే ఫీలింగే ఉంది. అయ్యో ఇది లేకపోతే ఎట్లా.. అది లేకపోతే ఎట్లా.. దేన్నీ వదులుకోవడానికి మనం సిద్ధంగా లేం. అన్నీ ఉన్న తర్వాత తినకపోతే అది ఉపవాసం. లేకపోతే తినకపోతే అది కరువు. ఈ వ్యత్యాసాన్ని అర్థం చేసుకుంటే గాంధీ బాగా అర్థమవుతాడు.



- ప్రొఫెసర్ (డా.) కె. సత్యలక్ష్మి,
డైరెక్టర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి,
పుణే, మహారాష్ట్ర

'పరిశుభ్రత, పారిశుధ్యం అనేవి రాజకీయ స్వాతంత్ర్యం కంటే ముఖ్యమైనవి. ఆదర్శ గ్రామం అంటే పరిపూర్ణ పారిశుధ్యం అని అర్థం. స్వరాజ్ భావన ముందుగా మన వీధుల నుంచే మొదలుకావాలి.' -మహాత్మాగాంధీ

'పరిశుద్ధ భారతదేశం మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా భారత్ ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళిగా ఉంటుంది.' - ప్రధాని నరేంద్రమోదీ

(2014 అక్టోబర్ 2న స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభం సందర్భంగా)

స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలో కేంద్రం తలపెట్టిన అత్యంత ప్రధానమైన పారిశుధ్య కార్యక్రమం స్వచ్ఛ భారత్ అభియాన్. దేశవ్యాప్తంగా 34 లక్షల మంది ప్రభుత్వోద్యోగుల సహకారంతో సాగుతున్న స్వచ్ఛభారత్, పారిశుధ్య కల్పన విషయంలో ప్రపంచంలోనే అత్యంత బృహత్ కార్యక్రమం. ఈ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా 'స్వచ్ఛ, పరిశుభ్రమైన భారత్ గురించి మహాత్మా గాంధీ కన్న స్వప్నాన్ని పరిపూర్తి చేయడమే దీని లక్ష్యం' అని మోదీ పేర్కొనడంతో స్వచ్ఛభారత్ అంతర్జాతీయ ప్రచారం పొందింది.

మరి స్వచ్ఛభారత్ కార్యక్రమానికి మూలమైన మహాత్మాగాంధీ పరిశుద్ధ భారత్ భావన ఎలా ఉనికిలోకి వచ్చింది? దీన్ని తాను దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడే ఆచరణలోకి తీసుకొచ్చిన గాంధీ భారత్‌లో మరింత విస్తృతస్థాయిలో పాటించారు. వందేళ్ల క్రితం మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి


# 'స్వచ్ఛ'మేవ జయతే

స్వదేశం తిరిగొచ్చినప్పుడు భారతీయ సమాజాన్ని పారిశుధ్యంతోటే అనుసంధానం చేశారు. కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో గాంధీ అశుద్ధాన్ని చూసి తక్షణం స్పందించిన తీరు పారిశుధ్యంపై ఆయన దృక్పథానికి స్పష్టమైన రుజువు. గాంధీ ఒక చీపురు తీసుకుని దాన్ని శుభ్రం చేశారు. దేశంలో పారిశుధ్య కార్యక్రమానికి అదే నాంది.


పారిశుధ్య కార్యక్రమం కులరహిత, స్వేచ్ఛా సమాజాన్ని తీసుకొచ్చే ప్రక్రియలో ఒక అంతర్గత భాగంగా ఉంటుందనేది గాంధీ అభిప్రాయం. అంటరానితనాన్ని తొలగించాలంటే పారిశుధ్యంపై వ్యక్తిగత బాధ్యతను పెంచాలని గాంధీ నొక్కి చెప్పేవారు. గుజరాత్‌లో ఒక రాజకీయ సదస్సులో పాల్గొన్న గాంధీ, 'మన ఇళ్లు, వీధులు, రోడ్లు అన్నీ అపరిశుభ్రంగా ఉంటున్నాయి. సాంక్రమిక వ్యాధులు ప్రబలడానికి అవే కారణమ'న్నారు.

మద్రాసులో కొంతమంది కార్మికులతో మాట్లాడుతూ 'మన డ్రాయింగ్ రూమ్‌తో సమానంగా మరుగుదొడ్డిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

పరిశుభ్రత, అంటరానితనం సమస్యలను గాంధీ ముడిపెడుతూ, మన సమాజంలో పాకీ పనిచేస్తున్న వారు ఎల్లప్పటికీ నిమ్నస్థాయిలోనే ఉండిపోవడం తీవ్రమైన అన్యాయమన్నారు. గాంధీ పరిశుద్ధ భారత్ ఆశయం సాకారం కావాలంటే 130 కోట్లకుపైగా భారతీయులు స్వచ్ఛభారత్‌ని తమదిగా భావించాలని మోదీ అన్నారు. గాంధీ 150వ జయంతి ముగింపు వేడుకల వేళ అదే ఆయనకు ఘనమైన నివాళి కూడా.



కె.రాజశేఖరరాజు





గాంధీ బ్రిటిష్ సైన్యంలో పనిచేశారా? మొదటి ప్రపంచయుద్ధం ముగిసే సమయంలో వైస్రాయ్ కోరిక మేరకు గాంధీజీ బ్రిటిష్ సైన్యంలో చేరారు. అయితే కేవలం అంబులెన్స్ సేవలకోసం మాత్రమే.



గాంధీజీ మాస్ లీడర్.. దానికి నిదర్శనమే ఈ చిత్రం. 1931లో లండన్ వెళ్లినప్పుడు ఆయనను చుట్టుముట్టిన స్థానికులు



గురువే సేవకుడై.. అనారోగ్యంతో ఉన్న భూదానోద్యమ పితామహుడు వినోబా భావే కాళ్లను ఒత్తుతున్న బాపూజీ. గాంధీని వినోబా భావే తన గురువుగా భావిస్తారు



వాదం.. సంవాదం... మహమ్మద్ అలీ జిన్నా నివాసం నుంచి వెళ్తూ ఏదో విషయమై ఆయనతో చర్చిస్తున్న మహాత్మాగాంధీ

# గాంధీ మార్గంలో పల్లెను మళ్లిదాం..

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రామ ఆర్థిక వ్యవస్థ ఒక భాగం. ఒక గ్రామానికి సంబంధించిన ఆర్థిక వ్యవస్థ, అనేక గ్రామాలను జతపరిచే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాదిరాయిగా నిలుస్తుంది. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, గ్రామ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా, స్వతంత్రంగా ఉన్న రోజుల నుంచి క్రమేపి బాహ్య ఆర్థిక వ్యవస్థపై ఆధారపడడం వలన సామాజిక, పర్యావరణ, ఆర్థిక, పాలనాపర మార్పులొచ్చాయి. కొన్ని ఆహ్వానించదగినవే కాగా, అనేక మార్పులు గ్రామీణ పరిస్థితులను, మానవ సంబంధాలను మార్చేశాయి. వందేళ్ల క్రితం నాటితో పోలిస్తే గత 50 ఏళ్లలో పలు గ్రామాలకు విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి. సగటు ఆదాయం పెరిగింది. బాహ్య ప్రపంచంతో సంబంధాలు పెరిగాయి.

ఇదే కాలంలో, గ్రామ వాతావరణం మారింది. గ్రామంలో పశువుల సంఖ్య తగ్గింది. వాహనాల సంఖ్య పెరిగింది. ఆత్మహత్యలు పెరిగాయి. పిల్లల్ని పోషకాహార లోపం పీడిస్తోంది. పచ్చటి పొలాల్లో విష రసాయనాల గత్తర కంపు ఊపిరి తీస్తోంది. భూగర్భ జలాలు అడుగంటాయి. నీటి కాలుష్యం పెరిగింది. ఉపాధి తగ్గింది. సంప్రదాయ వృత్తులు దెబ్బతిన్నాయి. వ్యవసాయం సంక్షోభంలో పడింది. భూమి లేని నిరుపేదలు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులపైనే ఆధారపడే దుర్భర పరిస్థితి.. పల్లెలలో ఆహార కొరత ఏర్పడింది. కొంటేనే కాని దొరకని ఆహార వ్యవస్థ గ్రామీణ ప్రాంతాల్లో వేళ్లూనింది. కొనే స్తోమత లేని కుటుంబాల సంఖ్య పెరిగింది. కూల్‌డ్రింకులు, చిప్స్ ప్యాకెట్లు దొరికినంత సులువుగా పల్లెల్లోనూ సహజ ఆహారం దొరకడం లేదు. నీతి ఆయోగ్ విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం రక్తహీనత గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా ఉంది. ఇటీవల విడుదలైన లాన్సెట్ పత్రికలో ఒక అధ్యయనం ప్రకారం 1990–2017 మధ్య కాలంలో పోషకాహార లోపంతో బాధపడుతున్న లేదా చనిపోతున్న చిన్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. ఐదేళ్లలోపు పిల్లలలో 68.2 శాతం మంది పోషకాహార లోపంతో చనిపోతున్నారని ఈ అధ్యయనం తేల్చింది.

మహాత్మాగాంధీ ఆలోచించిన గ్రామ స్వరాజ్యాన్ని విస్మరించిన ప్రభుత్వ విధానాలు ప్రత్యామ్నాయ వ్యవస్థను సృష్టించలేకపోయాయి. ఫలితంగా గ్రామీణులు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా మారిపోయారు. గ్రామస్తులకు తమ పరిధిలోని ప్రకృతి వనరులు 'తమ సొంతం'అనే భావన పోయింది. ఒకప్పుడు, గ్రామ చెరువును, చెరువు పరీవాహక ప్రాంతాన్ని, సమీప అటవీ ప్రాంతాన్ని, నేలను, భూమిని, నీటిని క్రమబద్ధంగా, ఏటా పద్ధతి ప్రకారం నిర్వహించుకునే గ్రామస్తులు ఇప్పుడు పట్టించుకోవడం మానేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక గ్రామాలు పూర్తిగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మీద కునుకు తీస్తున్నాయి. ఒకప్పటి గ్రామాలు ఉత్పత్తి, సేవల కేంద్రాలుగా, స్వయం సమృద్ధితో, నైపుణ్యంతో, కళలతో విరాజిల్లాయి. గ్రామ వనరుల స్వయం నిర్వహణ నుంచి క్రమేపీ కేంద్ర నిధులు, కాంట్రాక్టర్లు, కాంట్రాక్టుల పద్ధతి వచ్చింది. దేశంలోని ఆరున్నర లక్షల గ్రామాల నీటి వనరుల నిరంతర నిర్వహణ కేంద్రీకృత పాలనలో అసాధ్యంగా మారింది. గ్రామాభివృద్ధి నిధులు పలు అంచెలు, అవాంతరాలు దాటుకుని వచ్చేసరికి కొండంత నిధులు బఠానీలుగా మారుతున్నాయి. గాంధీ గ్రామ స్వరాజ్యం పునాదులపై కాకుండా, దానికి వ్యతిరేక దిశలో ఆర్థిక వ్యవస్థ నిర్మితమైంది. ఫలితం..పల్లెల్లోనూ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. ఆర్థిక అసమానతలు పెరిగాయి. ఉపాధి కోసం, ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో 'వలసలు' పెరిగాయి.


జనాభా లెక్కల ప్రకారం 2001లో 500లోపు జనాభా సంఖ్య ఉన్న గ్రామాలలో దేశ జనాభాలో 7.16 శాతం నివసిస్తుండగా, 2011 నాటికి అది 5.74 పడిపోయింది. 5,00,999 జనాభా ఉన్న గ్రామాల్లో నివాసితుల సంఖ్య 14.2 నుంచి 12.4 పడిపోయింది. ప్రభుత్వ విధానాలు, పెట్టుబడులు పట్టణీకరణకు దారితీస్తోంటే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది.

ఒకపక్క మనం పాశ్చాత్య దేశాల్ని అనుకరిస్తోంటే, మరో వైపు ఆ దేశాలు స్థానిక ఆర్థిక వ్యవస్థల్ని గట్టిపర్చుకుంటున్నాయి. అమెరికా వంటి దేశాల్లో వారాంతపు సంతలు పెరుగుతున్నాయి. ఆహారం, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే పర్యావరణం దెబ్బతింటుందని గుర్తించి, తమ స్థానిక ఆర్థిక వ్యవస్థల పునర్నిర్మాణానికి పునాదులు వేసుకుంటున్నాయి. కరెన్సీ లావాదేవీల బదులు పురాతన బార్టర్ పద్ధతి మేలని భావిస్తున్నాయి.


మన గ్రామాలు స్వతంత్ర వ్యవస్థతో నడిచేలా ప్రభుత్వ విధానాలు రావాలి. మహాత్మాగాంధీ–కుమారప్ప జోడి అందించిన ఆర్థిక సూత్రాలు, విధానాలను నీతి ఆయోగ్ వంటి ప్రణాళిక సంస్థలు ఆచరణలోకి తేవాలి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన గ్రామ సచివాలయ వ్యవస్థ గ్రామ స్వరాజ్య స్థాపనలో ఒక ముందడుగు. ఇప్పటి పరిస్థితులకు అది సరిపోయే ఆలోచన. కాకపోతే, గ్రామ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఉపయోగపడేలా, ఉత్పత్తిని, ఉత్పాదకతను ప్రోత్సహించేలా దీనిని మలుచుకోవాలి. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారమూ అవసరం. పల్లెలకు నిధులు కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు, ఒక దామాషా పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వస్తాయి. ఇది రానురాను రాజకీయమవుతోంది. ఏటా ప్రతి గ్రామానికి కేంద్రం సగటున రూ.10 లక్షల అభివృద్ధి, నిర్వహణ నిధులిస్తే, పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతుంది. అంటే, 6,40,000 గ్రామాలకు రూ.64 వేల కోట్లు. సాలీనా రూ.28 లక్షల కోట్ల బడ్జెట్లో ఇది 2 శాతం మాత్రమే. ఏటా క్రమం తప్పకుండా ఈ నిధులిస్తే, గ్రామాభివృద్ధి సాధ్యమే. గ్రామీణులు సహజ వనరులను తమ సొంతమనే భావనతో కాపాడుకుంటూ, సుస్థిరంగా నిర్వహించుకుంటే సమతుల్య అభివృద్ధి సాధించవచ్చు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు బలంగా, సుస్థిరంగా ఉంటే దేశం అభివృద్ధి చెందినట్లే.



- దొంతు నర్సింహారెడ్డి




‘సినిమాలను గాంధీజీ ద్వేషించారు. భావాలను ప్రసారం చేయడానికి సినిమాను ఒక సానుకూల మాధ్యమంగా ఆయన చూడలేదు.



లండన్ శాకాహార సంఘంలోని అల్లిసన్.. సంతాన నిరోధాన్ని సమర్థించేవారు. సభాధ్యక్షు డు హిల్స్ నీతి వాది. హిల్స్‌లాగే గాంధీ కూడా సంతాన నిరోధ ఉపాయాలకు వ్యతిరేకులు. కానీ అల్లిసన్‌ను సంఘంలోంచి తొలగించాలని హిల్స్ ప్రతిపాదిస్తే, గాంధీ వ్యతిరేకించారు, శాకాహార సంఘం సభ్యుడి అర్హత శాకాహారం వరకే పరిమితమని.

‘దేశంలో గాంధీ విగ్రహం లేని ఊరు లేదు. ప్రపంచవ్యాప్తంగా దక్షిణాఫ్రికా, డెన్మార్క్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, ఉగాండా, స్విట్జర్లాండ్ దేశాల్లో గాంధీ విగ్రహాలు ఉన్నాయి. లండన్‌లోని తవిస్టాక్ స్క్వేర్, పార్లమెంట్ స్క్వేర్ రెండు చోట్లా గాంధీవిగ్రహాలు ఉండటం గమనార్హం.

# విజయ తీరాల ‘తెర’చాప

అహింసా సిద్ధాంతంతో ప్రపంచవ్యాప్తంగా ఎందరో నాయకులకు ‘హీరో’ అయిన గాంధీజీ వెండితెర మీద మాత్రం హీరో కాకుండా ఉంటాడా?. వెండితెరపై ఆయనను చూసుకోకుండా ఈ దేశం ఎలా ఉంటుంది. అయితే ఈ పని చేసిన ఘనత భారతీయ దర్శకుడికి, గాంధీగా నటించి మెప్పించే అదృష్టం భారతీయ నటుడికి దక్కకపోవడమే ఇందులో విశేషం. ‘గాంధీ’ పేరుతో 1982లో విడుదలైన బయోపిక్కే నేటికీ గాంధీజీకి సంబంధించిన ఉత్కృష్టమైన చిత్రం. దీనిని మించిన చిత్రం నేటి వరకూ భారతీయులు తీయలేదు.

## బ్రిటిష్‌వారి సినిమా ప్లాన్

గాంధీ స్వాతంత్ర్యోద్యమాన్ని నాయకస్థాయి నుంచి ప్రజాస్థాయి వరకు తీసుకెళ్లాడు. ఇది తట్టుకోలేని బ్రిటిష్ ప్రభుత్వం.. గాంధీని దెబ్బ కొట్టాలని, 1923లో డి.డబ్ల్యూ.గ్రిఫిత్ అనే దర్శకుడిని సంప్రదించి గాంధీ వ్యతిరేక చిత్రం తీయమంది. అయితే ఆ పని జరగలేదు.

## గాంధీజీకి నచ్చని మాధ్యమం

గాంధీజీకి సినిమా మాధ్యమంపై సదభిప్రాయం లేదు. ఫాల్కే తీయగా దేశమంతా చూసిన తొలి టాకీ ‘రాజా హరిశ్చంద్ర’ను గాంధీ చూడనే లేదు. 1943లో విజయభట్ తీసిన ‘రామరాజ్య’ అనే సినిమాను కొద్దిరీళ్లు మాత్రమే చూశారు. తన జీవితంలో గాంధీజీ చూసి న ఏకైక సినిమా అది. ‘సినిమాల వల్ల ఏం మేలుందో చె ప్పలేను కానీ, చాలావరకు సినిమాలు నాసిరక భావాలు కలిగినవి’ అనే అర్థంలో ఆయన ‘హరిజన్’ పత్రికలో రాశారు. గాంధీజీకి చార్లీచాప్లిన్ విశేషమైన అభిమాని. 1931లో 2వ రౌండ్‌టేబుల్ సమావేశానికి వెళ్లినప్పుడు గాంధీజీ చాప్లిన్‌ను కలిశారు. చాప్లిన్‌తో మాట్లాడుతూ ‘యంత్రాలనేవి మనిషి శ్రమను తగ్గించాలి. బానిసత్వం నుంచి విముక్తం చేయాలి. వారిని పని నుంచి తొలగించే, మరింత పని కల్పించే భూతాలు కారాదు’ అని చర్చించారు. ఆ ఆలోచనకు చాప్లిన్ ఇచ్చి న గొప్ప సెల్యులాయిడ్ రూపమే ‘మోడరన్ టైమ్స్’.

## నెహ్రూ ప్రయత్నాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక గాంధీజీ మీద ఒక పూర్తి స్థాయి సినిమా తీయాలని నెహ్రూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆశించాయి. 1958లో డేవిడ్ లియాన్ వంటి గొప్ప దర్శకుడు గాంధీజీ మీద రాసుకున్న స్క్రిప్ట్ ను నెహ్రూకు చూపాడు. అది ఒకే కాలేదు. 1962లో లండన్‌లో స్థిరపడ్డ గాంధేయవాది మోతీలాల్ కొఠారి నుంచి ప్రఖ్యాత దర్శకుడు అటెన్ బరోకు పిలుపు వచ్చింది ‘గాంధీ’ సినిమా తీయాలని. అటెన్‌బరో ఈ ప్రయత్నాల్లో ఉండగానే 1963లో గాంధీజీపై సినిమా తీయాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకుంటున్నట్టు నెహ్రూ చెప్పాడు. 18 ఏళ్ల పాటు శ్రమించి, ‘గాంధీ’ సినిమా తీశాడు. సినిమా ప్రారంభానికి నిధుల సమస్య ఎదురైనప్పుడు ఇందిరా గాంధీ సిఫార్సుపై నేషనల్ ఫిలి మ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ప్రాథమిక నిధిని విడుదల చేసింది. ఆ సమయంలో తెలుగువాడైన డీవీఎస్ రాజు కార్పొరేషన్ చైర్మన్.

## బెన్‌కింగ్‌స్లే

గాంధీ పాత్ర పోషించే అదృష్టం బ్రిటిష్ నటుడు బెన్‌కింగ్‌స్లేకు వరించింది. బెన్‌కింగ్‌స్లే ఆ పాత్ర పోషించడానికే జన్మించాడా అన్నట్టు ప్రేక్షకులను మైమరిపించాడు. అదీగాక అతని తండ్రి తరపు పూర్వీకులు గుజరాత్‌కు చెందినవారన్నది సంతోషపరిచే విషయమైంది. 1982 నవంబర్ 30న విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. బెన్‌కింగ్‌స్లేను ఆస్కార్ అవార్డు వరించింది.


## దేశీయతెరపై గాంధీ

ఇక తెలుగు, హిందీ భాషల్లో గాంధీ ప్రభావంతో గాంధీ పాత్రధారిగా చాలా సినిమాలు వచ్చాయి. గూడవల్లి రామబ్రహ్మం తొలిరోజుల్లో తీసిన సినిమాలు ‘మాలపిల్ల’, ‘రైతుబిడ్డ’ గాంధీ ప్రభావం కథాంశంగా రూపొందించినవే. 1974లో లక్ష్మీదీపక్ తీసిన ‘గాంధీ పుట్టిన దేశం’ మరో ముఖ్యమైన సినిమా. కె.బాలయ్య ‘ఊరికిచ్చిన మాట’, కె.విశ్వనాథ్ ‘జననీ జన్మభూమి’ సినిమాలు ఎంచదగినవి. గాంధీ కోరిన గ్రామ స్వరాజ్యాన్ని, ఆ స్వరాజ్యం సాధించడానికి పడాల్సిన సంఘర్షణను కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ‘రుద్రవీణ’ సమర్థంగా చూపించింది. యమున నటించిన ‘మౌన పోరాటం’ గాంధీజీ దీక్షాశక్తిని చూపించేదే. అహింసే అసలైన పోరాటమార్గమని చెప్పడానికి కృష్ణవంశీ ‘మహాత్మ’ తీశాడు. గాంధీజీని ప్రస్తావించే పాటలు కూడా తెలుగులో ఉన్నాయి. ‘గాంధీ పుట్టిన దేశం రఘురాముడు ఏలిన రాజ్యం’ (గాంధీ పుట్టిన దేశం), ‘గాంధీ పుట్టిన దేశమా ఇది’ (పవిత్రబంధం), ‘భలే తాత మన బాపూజీ’ (దొంగరాముడు), ‘కొంతమంది ఇంటిపేరు కాదురా గాంధీ’ (మహాత్మ).. ఇలా అనేకం.

## లగే రహో మున్నాభాయ్

గాంధీ ప్రభావంతో హిందీలో అశోక్ కుమార్ తీసిన ‘అఛూత్ కన్య’ మొదటిది. శ్యాం బెనగళ్ ‘గాంధీ సే మహాత్మా తక్’, మహెబూబ్ ఖాన్ ‘మదర్ ఇండియా’, హృషికేశ్ ముఖర్జీ ‘సత్యకామ్’, శాంతారామ్ ‘దో ఆంఖే బారాహాత్’ గాంధీ ప్రభావంతో రూపుదిద్దుకున్నాయి. ‘సర్దార్’లో, ‘బాబాసాహెబ్ అంబేద్కర్’లో, కమల్‌హాసన్ తీసిన ‘హే రామ్’లో గాంధీజీ ఒక పాత్రగా కనపడతాడు. గాంధీ సిద్ధాంతాన్ని వినోదాన్ని ముడిపెట్టి హిట్ కొట్టిన సినిమా ‘లగేరహో మున్నాభాయ్’. రాజ్ కుమార్ హిరాణి తీసిన ఈ సినిమా ఈ తరానికి గాంధీని మళ్లీ పరిచయం చేసింది.

- సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



# నాటకంలో గాంధీ బాట

జాతీయోద్యమంలో మహాత్మునిది ఒక శకం. బ్రిటీష్‌వారు ఈ ప్రపంచాన్ని పాలించడానికే పుట్టారన్న భావన ఆయన రాకతో పటాపంచలైంది. దక్షిణాఫ్రికాలో మొదటి తరగతి రైలు బోగీ నుంచి గెంటి వేయబడిన ఒక భారతీయుని ఆత్మబలం ఆ తర్వాత రోజుల్లో జాతీయోద్యమానికి నాయకత్వం వహించేలా ప్రజ్వరిల్లింది. అహ్మదాబాద్ కోర్టులో మహాత్మునిపై రాజద్రోహం నేరం మోపబడినప్పుడు ‘నేను నిప్పుతో చెలగాటం ఆడుతున్నానని నాకు తెలుసు. కానీ మీరు స్వేచ్ఛనిచ్చి వదిలేస్తే నేను మళ్లీ అదే పని చేస్తాను’ అన్నాడాయన. గాంధీ ఇచ్చిన ఇలాంటి స్టేట్మెంట్లు భారతీయుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అప్పటివరకు ఉన్నత వర్గాలకు పరిమితమైన స్వాతంత్ర్య పోరాటం కింది వర్గాలకు చేరింది.

ఆనాడు జాతి యావత్తు గాంధీ వైపు చూసింది. అతని బాట నడిచింది. కవులు గొంతు కలిపారు. కళాకారులు వంతపాడారు. ఎంతో కవిత్వం, అనేక కథలు, నవలలు, నాటకాలు భారతీయ భాషల్లో వచ్చాయి. స్వరాజ్య సాధనే లక్ష్యంగా గాంధీని, గాంధీతత్త్వాన్ని వస్తువుగా చేసుకొని వచ్చిన నాటకాలు నాడు తెలుగునాట ఉద్రుత లూగించాయి.

తెలుగులో మొదట గాంధీజీని కథానాయకుడిగా చేసుకొని రెండు నాటకాలు 1. నవయుగం, 2. గాంధీ విజయం రాసినవారు దామరాజు పుండరీకాక్షుడు. ఈయన గొప్ప గాంధేయవాది. ఇంకా, పండిత సీతారామ రచించిన ‘స్వరాజ్యధ్వజము’, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి ‘గాంధీ విజయ ధ్వజ నాటకం’, పాకురి అంజయ్యగారి రచన ‘భారత దివ్య దర్శనం’, ముద్దా విశ్వనాథంగారి ‘జన్మభూమి’, జాస్తి వెంకట నరసయ్య, ధూళిపాల వెంకట సుబ్రహ్మణ్యం గార్లు కలిసి చేసిన రచన ‘కాంగ్రెస్ విజయం’ ముఖ్యమైనవి.

గాంధీ మహాత్ముని కథానాయకుడిగా ఈ వ్యాస రచయిత రచించిన ‘గాంధీ జయంతి’ (నాటకం), ‘బాపు చెప్పిన మాట’ (నాటిక) విరివిగా ప్రదర్శితమయ్యాయి. గాంధీ బతికి వచ్చి ఈనాటి రాజకీయ నాయకుల్ని, వారి ప్రవర్తనను, ప్రజలపై వారికున్న అవకాశవాద దృక్పథాన్ని చూసి ఎలా స్పందిస్తారనేది ఇతివృత్తం. గాంధీ చెప్పిన మాటను సూచించిన బాటను అనుసరించని రాజకీ య పక్షాలు అన్నీ ఏకమై కుట్రపన్ని ఆయన్ని ఖూనీ కేసులో ఇరికిస్తారు. గాంధీజీకి ఉరిశిక్ష పడుతుంది. గాంధీ తన చివరి కోరికగా భారతదేశంలో మళ్లీ పుట్టాలని ఉందంటాడు. దేవేంద్రుని సారథి మాతలి తీసుకొచ్చిన పుష్పక విమానంపై తిరిగి స్వర్గానికి వెళ్లిపోతూ..

‘ఉషోదయపు వెలుగుల్లో జాబిలి వెన్నెల్లో నేనే ఉంటాను.. విరిసిన పుష్పంగా, కురిసే మేఘంగా నేనే వస్తాను.. నింగిన చుక్కనై, నాలుగు దిక్కులై నేనే నిలుస్తాను.. అన్యాయపు కోటలని, అవినీతి బాటల్ని అంధకారపు గోడల్ని అం తం చేయడానికి మళ్లీ అవతరిస్తా.. అంతం చేస్తా... అంటూ ఆ నాటకం ముగుస్తుంది.



- డాక్టర్ దీర్ఘశి విజయభాస్కర్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత






# గాంధీ ముస్లిం భాయ్.. భాయ్

మహాత్మా గాంధీ జీవితంలో ముస్లింల ప్ర మేయం ఎంత గాఢంగా పెనవేసుకుపోయిందో ఆయన జీవి తం తరచి చూస్తే అర్థమవుతుంది. ముస్లింల సంపూర్ణ మద్దతు లేకపోయి ఉంటే వారిలోని మహా మహా నాయకులు గాంధీజీకి తోడుగా నడవకపోయి ఉంటే గాంధీజీ స్వాతంత్ర్యోద్యమం అసంపూర్ణంగా ఉండేదనే చెప్పాలి. గాంధీ–ముస్లింల జమిలీగా సాగింది.

అసలు గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్లడానికి ఒక సంపన్న ముస్లిం కారణం అని చాలామందికి తెలియకపోవచ్చు. దక్షిణాఫ్రికాలోని వ్యాపారి దాదా అబ్దుల్లా తన వ్యాపార లావాదేవీలలో స్థానిక న్యాయవాదులకు సహకరించాలని ఆహ్వానించడంతో 1892లో గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడ భారతీయులు ఎదుర్కొంటున్న వివక్షను స్వయంగా అనుభవించిన గాంధీ దాదా అబ్దుల్లా ఆయన అనుచరుల వినతితో వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ఆరంభించారు. దాదా అబ్దుల్లా గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలోనే ‘నాటల్ ఇండియన్ కాంగ్రెస్’ ఏర్పడింది. ఆ సంస్థ తొలి అధ్యక్షులుగా దాదా అబ్దుల్లా, కార్యదర్శిగా ఎం.కె.గాంధీ వ్యవహరించారు. ‘ఆ కారణంగా ప్రజాసేవ చేయాలన్న తలంపు అక్కడే కలిగింది. అందుకు అక్కడే శక్తి చేకూరింది’ అని స్వయంగా గాంధీజీ తన ఆత్మకథలో రాసుకున్నారు. 21 ఏళ్ల పాటు దక్షిణాఫ్రికాలో ఉన్నపుడు దాదా అబ్దుల్లా గాంధీకి అన్నివిధాలా తోడ్పాటు అందించడంతో ‘దాదా అబ్దుల్లా ఆయనకు తండ్రిలా తోడ్పడ్డారు’ అని చరిత్రకారులు అన్నారు.

1915లో గాంధీ భారత్ వచ్చేటప్పుడు అక్కడి గుర్రాల వ్యాపారి, సంపన్నుడైన అబ్దుల్ ఖాదిర్ కూడా ఆయనతో పాటు తన కుటుంబంతో వచ్చారు. సంపన్న జీవి తాన్ని వదిలి గాంధీతో పాటుగా ఆశ్రమ జీవితం గడిపారు. సబర్మతీ ఆశ్రమంలో ముద్రణాలయం బాధ్యతలను నిర్వహిం చారు. గాంధీ ఈయనను ‘ఇమాం సాబ్’ అని పిలిచేవారు. ఖాదిర్ కు మార్తె అమనా ఖురేషి పెళ్లికి మహాత్మాగాంధీ వధు వు బాబాయిగా తన పేరుతో ఆహ్వానపత్రాలను వేయించి, సబర్మతీ ఆశ్రమంలో దగ్గరుండి పెళ్లి జరిపించారు.

మహాత్ముడు బిహార్ రాష్ట్రం చంపారన్‌కు రాకముందే ఈ పోరాటానికి పునాదులను నిర్మించిన రైతు నాయకులు షేక్ గులాబ్, పాత్రికేయుడు పీర్ ముహమ్మద్ మూనీస్ గాంధీ వెంట నడిచారు. నీలిమందు కర్మాగారాల ఆంగ్లేయ యజమానులు గాంధీ కార్యక్రమాలకు అంతరాయం కల్పించేందుకు ప్ర యత్నించడమే కాకుండా ఆయనను అం తం చేయాలని సంకల్పించారు. దీన్ని బట్ట బయలు చేసి గాంధీ ప్రాణాలను బతఖ్ మియా అన్సారి అనే సాహసి కాపాడారు. ఈ విషయాన్ని భారత ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1950లో బహిర్గతం చేయడమే కాకుండా అన్సారికి భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈనాటికీ ఆ ఆదేశాలు అమలుకు నోచుకోకపోవడం ఒక విషాదం.

గాంధీ రాజకీయ రంగప్రవేశం చేశాక జాతీయ స్థాయిలో పూనిన అతి పెద్ద ఉద్యమం ఖిలాఫత్ – సహాయ నిరాకరణ ఉద్యమం. ఇందులో ఆయనకు అలీ సోదరులు గా ఖ్యాతిగాంచిన మౌలానా మహమ్మద్ అలీ జౌహర్, మౌలానా షౌకత్ అలీ అండదండలు అం దించారు. అలీ సోదరుల తల్లి అబాది బానో 70 ఏళ్ల వయసులో ఉద్య మ నిధులను సేకరిస్తున్న తీరు, జాతీయోద్యమంలోకి మహిళలను, పురుషులను ఆహ్వానిస్తూ చేస్తున్న ప్రసంగాలు గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను ప్రమాదకర మహిళగా ప్రకటించింది. గాంధీతో పాటు ఇతర జాతీయోద్యమకారులంతా ‘అమ్మాజాన్’, ‘బీబీ అమ్మా’ అంటూ ఆమె ను గౌరవించే వారు. ఈ యోధురాలి కార్యదక్షతను, కార్యశీలతను మహాత్ముడు తన యంగ్ ఇండియాలో ప్రత్యేకంగా ఉటంకించారు. అలాగే జాతీయోద్యమం కోసం ఎంతో ఖర్చు చేసిన డాక్టర్ ముఖ్తార్ అహ్మద్‌అన్సారి, షంషున్నీసా అన్సారి దంపతులపై గాంధీ ఎంతో వాత్సల్యం చూపారు.

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ‘సరిహద్దు గాంధీ’గా విఖ్యాతుడైన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ 1928లో తొలిసారి గాంధీని చూశారు. ఆయుధం ఆభరణంగా కలిగివుంటూ, మిత్రునికి ప్రాణమివ్వడానికి, శత్రువు ప్రాణం తీయడానికి ఏమాత్రం సంకోచించని పఠాన్ జాతి నాయకుడైన గఫార్‌ఖాన్ మహాత్ముడి అహింసా సిద్ధాంతం పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్ముడి కార్యాచరణను యథాతథంగా అమలుపర్చుతూ ‘ఖుదా–యే–ఖిద్మత్‌గార్’(భగవత్సేవకులు) సంస్థను 1929లో స్థాపించాడు. భారత జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడం, భారత విభజనను అంగీకరించకపోవడంతో ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ 30 ఏళ్ల పాటు జైలు జీవితం, ప్రవాస జీవితం గడపాల్సి వచ్చినా గాంధీ బాటను వీడక సంపూర్ణ గాంధేయవాదిగా జీవితాన్ని గడిపారు.

గాంధీజీకి పూర్తి తోడుగా నిలిచిన మరో మహనీయుడు జస్టిస్ అబ్బాస్ తయ్యాబ్జీ. భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభించకముందే ‘గుజరాత్ రాజ కీ య పరిషత్’ ద్వారా సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిర్వహిస్తున్న తయ్యాబ్జీ మహాత్మా గాంధీ ప్రేరణతో 1919లో అన్ని విలాసాలకు స్వస్తిపలికి స్వదేశీ ఉద్యమంలో పూర్తి భాగస్వామి అయ్యారు. ఎనభై సంవత్సరాల వయసులో ఖద్దరును ప్రోత్సహించేందుకుగాను ఎద్దులబండిలో ‘విముక్తి వస్త్రాన్ని’ విక్రయిస్తూ గుజరాత్‌లోని గ్రామాల్లో తిరిగారు. 1930లో 12 మార్చి నుంచి ఏప్రిల్ 6 వరకు సాగిన దండి యాత్ర సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని అరెస్టు చేసినపుడు ఆయన స్థానంలో యాత్రకు నాయకత్వం వహించిన వ్యక్తి అబ్బాస్. ఈయన గాంధీజీచే ‘గుజరాత్ వజ్రం’గా ప్రశంసలందుకున్నారు.

గాంధీ దంపతుల పుత్రిక బీబీ అమతుస్సలాం మహాత్ముని అహింసా సిద్ధాంతం, కార్యచరణకు ఆకర్షితురాలై 1931లో అతి ప్రయాసతో సేవాగ్రాం చేరారు. గాంధీ పర్యటనల్లో ఆమే ఆయన వెంటుంటూ సేవలందించారు. గాంధీజీ జిన్నాకు లేఖ రాస్తున్న సందర్భంగా ఆయనను ఏ విధంగా సంబోధించాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతుండగా, అమతుస్సలాం ‘ఖాయిదే ఆజం’అయితే బాగుంటుందని సూచించారు. ఆ విధంగా గాంధీజీ జిన్నాను సంబోధించడంతో ‘ఖాయిదే ఆజం’ పేరుతో జిన్నా పేరొందారు.

గాంధీకి సన్నిహితంగా మెలిగిన వారిలో అగ్రగణ్యుడు అబుల్ కలాం ఆజాద్. 1920 జనవరిలో తొలిసారి గాంధీని కలుసుకున్న ఆజాద్ అప్పటి వరకు తాను అవలంబిస్తున్న విప్లవబాటను వీడి అహింసా మార్గాన ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. భారత విభజనను, వేర్పాటు వాదాన్ని వ్యతిరేకించారు. మహాత్ముని సహచరులుగా, అనుచరులుగా పురుషులతోపాటుగా చాలామంది ముస్లిం మహిళలు జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మహాత్ముని ఆదేశాలతో గుజరాత్‌లో గాంధేయ మార్గంలో సాగిన అన్ని పోరాట రూపాలకు సారథ్యం వహించిన మహిళ అమీనా తయాబ్జీ. గాంధీజీకి ఉర్దూ భాష నేర్పి ఆయనచే ‘వస్తాద్ బీ’అని అనిపించుకున్న మహిళ రెహానా తయాబ్జీ. అసాధారణ దేశభక్తికి అపూర్వ చిహ్నంగా పేర్కొనబడిన సకీనా లుక్మాని పెద్ద వయసులోనూ గాంధీ మార్గాన్ని అనుసరిస్తూ మహాత్ముని ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించారు.

స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల త్యాగాలు గాంధీజీకి సంపూర్ణంగా తెలుసు. హిందూ ముస్లింలు కలిసి ఈ దేశాన్ని ముందుకు నడిపించాలని ఆయన ఎంతగానో భావించారు.



- సయ్యద్ నశీర్ అహ్మద్, ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల పరిశోధకుడు